# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

శనివారం 10 ఆగష్టు 2024

## ర్యాగింగ్‌కు పాల్పడి జీవితాలు నాశనం చేసుకోవద్దు

**కలికిరి, ఆగస్టు 9, ప్రభాతవార్త:**




విద్యార్థులకు ర్యాగింగ్‌కు పాల్పడి క్రిమినల్ కేసులు నమోదు చేయించుకొని తమ జీవితాలు నాశనం చేసుకోవద్దని వాల్మీకిపురం కోర్టు జూనియర్ సివిల్ జడ్జీ గురు అరవింద్ అన్నారు. శుక్రవారం కలికిరి జేఎన్‌టీయూ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో వాల్మీకిపురం కోర్టు జూనియర్ సివిల్ జడ్జీ గురు అరవింద్ హాజరై విద్యార్థులకు ర్యాగింగ్‌పై అలాగే ర్యాగింగ్ చేస్తే జరిగే పరిణామాలపై అవగాహన కల్పించారు. ఉచిత న్యాయ సేవలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఎక్కడా క్రిమినల్ చర్యలకు పాల్పడి తమ జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వెంకటేశ్వరరావు, ఏఎస్సై మహబూబ్‌బాషా, కోర్టు కానిస్టేబుల్ శివ, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ సభ్యుడు ఎల్లారెడ్డి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అంతుచిక్కని వ్యాధితో పశువులు మృతి

**జమ్మలమడుగు, ఆగస్టు 9, ప్రభాతవార్త:**



మైలవరం మండల పరిధిలోని వద్దిరాల గ్రామంలో 5 పశువులు శుక్రవారం అంతుచిక్కని వ్యాధితో మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. వద్దిరాల చుట్టుపక్కల గ్రామాలైన చిన్నవెంతుర్ల, ధన్నవాడ, బెస్తవేముల, వద్దిరాల, తదితర ప్రాంతాల నుంచి రైతులు వద్దిరాల పశువైద్యశాలపై ఆధారపడి ఉన్నారు. దేవుడి లేని దేవాలయంలా డాక్టర్ లేని ఆసుపత్రిలో ఏ అవసరం వచ్చినా ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర వైద్యానికి తమ పశువులు ఇతర సుదూర ప్రాంతాలకు తీసుకొని పోయి వైద్యం చేయించలేక పశువులు మృత్యువాత పడుతున్నాయని పాడి పశువుల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే వర్షాలు లేక పశుపోషణ భారమైనప్పటికీ భరిస్తున్నామని ఈ అంతుచిక్కని వ్యాధితో మృత్యువాత పడకుండా ముందస్తు టీకాలు వేసి ఉంటే పశువులు బతికేవని రైతులు అంటున్నారు. రైతులకు ఆధారమైన పసుపోషణ పట్ల అధికారుల నిర్లక్ష్యంపై తీవ్రంగా రైతులు మండిపడుతున్నారు. వద్దిరాల పశువైద్యశాల డా.హరి రవీంద్రరెడ్డి ఉదయం 10 నుంచి మధ్యాహ్నం వరకే ఉంటున్నారని అనేక ఆరోపణలు కూడా రైతులు చేస్తున్నారు. ఈ విషయంపై మండల పత్రికా ప్రతినిధి పశువైద్యశాల డాక్టర్ హరిరవీందర్‌రెడ్డిని వివరణ అడగగా తాను సెలవులో ఉన్నానని పశువులు మృతి చెందిన విషయం తన దృష్టికి రాలేదని ఆయన అన్నారు. ఏది ఏమైనప్పటికీ పశువులకు టీకాలు వేయించి పశువులను మృత్యువాత పడకుండా కాపాడాలని రైతులు కోరుతున్నారు.

# తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం ఉండదా

- మరమ్మతుల పేరుతో నిధులు స్వాహా
- మోటార్లు రిపేర్లు అంటూ కాలయాపన
- వైర్లు కాలిపోతున్నా పరిష్కారం చూపని అధికారులు
- మరమ్మతులకు లక్షలు రూపాయలు ఖర్చు



**బద్వేలు, ఆగస్టు 9 (ప్రభాతవార్త):**

బద్వేలులో తాగునీటి సమస్యను పరిష్కరించడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. కేవలం 8 సంవత్సరాల క్రితం మోటార్లు వాటికి సంబంధించిన సామాగ్రి నేడు మరమ్మతుల కారణంగా నిత్యం సమస్య ఏర్పడుతోంది. అయితే మోటార్లు వాటికి సంబంధించిన సామాగ్రి రిపేర్లకు వస్తుండడంతో మరమ్మతుల పేరుతో లక్షల రూపాయలు ఖర్చుపెడుతున్నట్లు చూపుతున్నారు తప్ప వాటికి శాశ్వత పరిష్కారం చూపడం లేదు. ఈ మధ్యకాలంలో బ్రహ్మంసాగర్‌లో నీటి సమస్య ఏర్పడడంతో అధికంగా మోటార్లు ఏర్పాటు చేయడమే కాకుండా వాటికి సంబంధించిన వైర్లు కూడా నాణ్యతలేనివి వాడడం వలన ఈ మధ్యకాలంలో నిత్యం రిపేర్లు వస్తున్నాయి. గత నెలలోనే మూడుసార్లు మోటార్లు మరమ్మతులు చేపట్టారంటే గత ఆరు మాసాల నుంచి ఎన్నిసార్లు మరమ్మతులు చేపట్టారో లెక్కలేని పరిస్థితి. దీనిపేరుతో నిత్యం రిపేర్లకు వెళ్లడం వాటికి వేలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు తప్ప కొత్తవాటిని కొనుగోలు చేస్తే వాటి వలన సంవత్సరాలు రిపేరు రాకపోవడమే కాకుండా మోటార్లకు గ్యారెంటీలు కూడా ఉంటాయి కాబట్టి వెంటనే వాటిని ఉపయోగించుకోవచ్చు. కానీ మున్సిపాలిటీలోని ఇంజనీరింగ్ విభాగంలో ఉన్న అధికారులు నిధులు స్వాహా చేసేందుకు మరమ్మతుల పేరుతో నిత్యం రిపేర్లు చేస్తూ లక్షల రూపాయలు నిధులు దుర్వినియోగం చేయడమే కాకుండా నీటి సమస్య ఉత్పన్నమయ్యేలా చేస్తున్నారు. ఈ మధ్య కాలంలో వైర్లు కాలిపోయాయని మోటార్లు చెడిపోయాయని లక్షల రూపాయలు ఖర్చు పెట్టారు. అంతేకాకుండా బ్రహ్మంసాగర్ పంపింగ్ వద్ద సరైన మెయింటెనెన్స్ లేకపోవడం పాత మోటార్ల వలన వస్తున్న రిపేర్లపై నిర్లక్ష్యం చూపడం కారణంగా బద్వేలులో మూడు, నాలుగు రోజులు, వారం పది రోజులు కూడా నీళ్లు రాని పరిస్థితి ఏర్పడింది. కొన్ని వార్డులలో వారం దాటినా నీళ్లు రావడం లేదు. ఎటులేదన్నా మినిమం మూడు రోజులకు ఒకసారి మాత్రమే నీళ్లు వదులుతున్నారు. లక్షల రూపాయలు పన్నుల రూపంలో వసూలు చేసి కోట్ల రూపాయలలో ఆదాయం ఉన్న మున్సిపాలిటీకి ఇలాంటి సమస్యలను పరిష్కరించడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. పాలకవర్గం కూడా నీటి సమస్యను పట్టించుకున్న పాపానపోలేదు. పట్టణమంతా 20 శాతం బోర్లు ఉంటే, 80 శాతం ప్రజలు మున్సిపాలిటీ నీటిపైనే ఆధారపడి జీవిస్తున్నారు. నీటి సమస్య గత జనవరి నుంచి ఉన్నప్పటికీ ఇంతవరకు సమస్యను పరిష్కరించిన పాపాన పోలేదు. రూ.110 కోట్లతో బ్రహ్మంసాగర్ నుంచి నీరు తెచ్చారేగాని, వారానికి మూడు , ఐదు రోజులకోసారి , పదిరోజులకోసం వచ్చే ఈ నీటికోసం ఇన్ని కోట్లు అవసరమాఅని ఇక్కడే కొత్తబోర్లు వేసి ఉన్న పాత బోర్ల ద్వారా నీటిని సరఫరా చేసి పట్టణమంతా సరఫరా చేసే అవకాశం ఉంటుందన్నారు. బద్వేలు చుట్టూ చెరువు ఉన్నప్పటికీ నీటిని సద్వినియోగం చేసుకోవడంలో ప్రజా ప్రతినిధులుగాని, అధికారులు గాని పట్టించు కోవడం లేదు. ఇప్పటికైనా మరమ్మతుల పేరుతో రిపేర్లు అవుతున్న మోటార్లకు మోక్షం కలిగించి నిత్యం నీటిని ప్రజలకు సరఫరా అయ్యేలా చూడాలని కోరుతున్నారు. అలాగే మరమ్మతుల పేరుతో అవుతున్న నిధుల స్వాహాపై కూడా ఉన్నతాధికారులు దృష్టిపెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## అంగరంగ వైభవంగా అంకాలమ్మ తల్లి ప్రతిష్ఠ

- కనుల విందుగా ఎద్దుల బండలాగుడు పోటీలు
- భారీగా పాల్గొన్న భక్తులు, ప్రజలు



**పులివెందుల, ఆగస్టు 9, ప్రభాతవార్త :**

పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని పెద్దరంగాపురంలో వెలసిన శ్రీఅంకాలమ్మతల్లి ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు అర్చకులు వెల్లాల సీతారామశర్మ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ఘనంగా జరిగాయి. మూడోరోజు శుక్రవారం ఉదయం యంత్రప్రతిష్ఠ, బింబప్రతిష్ఠ, ధ్వజ, కలశ, నాగప్రతిష్ఠ, గోదర్శనం, ప్రతిష్ఠహోమము, పూర్ణాహుతి, కలశ ఉద్వాసనం, బ్రాహ్మణాశీర్వచనం, స్వస్తి కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి బింబ ప్రతిష్ఠ మహోత్సవంలో గ్రామ ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. గ్రామం నుండే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం గ్రామస్థులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్, కౌన్సిలరు కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

**మొదటి బహుమతి మార్తల చంద్ర ఓబుళరెడ్డిదే :**

శ్రీఅంకాలమ్మ తల్లి ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా మూడోరోజు శుక్రవారం నిర్వహించిన సీనియర్ ఎద్దుల బండలాగుడు పోటీలు కనులవిందుగా సాగాయి. ఎద్దుల పోటీలను ప్రజలు ఉత్సాహంగా ఈలలు వేస్తూ వీక్షించారు. ఈ పోటీలను మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ పోటీల్లో మొదటి, రెండో బహుమతులను చౌటపల్లెకు చెందిన చంద్ర ఓబుళరెడ్డికి చెందిన ఎద్దులు 2070 అడుగులు, 2037 అడుగులు లాగి మొదటి, ద్వితీయ బహుమతులు సాధించాయి. తృతీయ బహుమతిని కుందూరు రాంభూపాల్‌రెడ్డి ఎద్దులు సాధించాయి. బాటపల వేటపాలెంకు చెందిన ఆర్.కె.బుల్స్ నాల్గో బహుమతి, రామతీర్థంకి చెందిన నాగరాజు ఐదో బహుమతి, కె.రామాంజనేయులు ఎద్దులు ఆరో బహుమతిని, తోపుదుర్తికి చెందిన కె.చెన్నప్ప ఎద్దులు ఏడో బహుమతిని, మేదిమక్కపల్లెకు, పీఆర్‌పల్లెకు చెందిన పవన్‌కుమార్‌రెడ్డి, శ్రీరాములు యాదవ్‌లకు చెందిన జంట ఎద్దులు ఎనిమిదో బహుమతిని, మూలి రామాంజనేయులుకు చెందిన ఎద్దులు తొమ్మిదవ బహుమతులను గెలుపొందాయి. గెలుపొందిన వారికి దాతలచే దేవస్థానం నందు విజేతలకు బహుమతులు అందించారు. మొదటిస్థానంలో నిలిచిన ఎద్దుల యజమానికి దేవస్థానం తరపున రూ.15వేలు విలువ చేసి అమ్మవారి వెండి బొమ్మను అందించారు.



## వాసవి మాతకు వైభవంగా సారెమహోత్సవం

**బద్వేలు అర్బన్, ఆగస్టు 9 (ప్రభాతవార్త):**



శ్రావణమాసం పురస్కరించుకుని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కేవి.సుబ్బారావు, సెక్రటరీ నాగరాజ, మహిళా మండలి అధ్యక్షురాలు దేవతి లలిత, సెక్రటరి గంగిశెట్టి ధనలక్ష్మితో పాటు పలువురు కమిటి సభ్యుల ఆద్వర్యంలో వాసవి మాత అమ్మవారికి వివిద రకాల ప్రత్యేక పూజలను వైభవోపేతంగా నిర్వహించారు. అనంతరం పలువురు మహిళలు ఎర్రచీరలు ధరించి వాసవిమాత అమ్మవారికి సారెను ప్రత్యేక బ్యాండు మేళాలతో తీసుకెళ్లి వివిద రకాల పిండివంటలు, స్వీట్లతో సారెను సమర్పించారు. శ్రావణమాసం సందర్భంగా పలువురు భక్తులు భక్తి, శ్రద్ధలతో వాసవిమాత అమ్మవారిని దర్శించుకుని తమ భక్తిని చాటుకున్నారు. పలువురు ఆలయ కమిటి సభ్యులు భక్తులకు ప్రత్యేక తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళా మండలి స్టేట్ ఉపాధ్యక్షురాలు కొండపల్లి దేవి, మాజీ అధ్యక్షురాలు చింతకుంట ధనమ్మ, వల్లంకొండు శారద, జూటూరు పద్మ, బచ్చు పార్వతమ్మ, నాగలక్ష్మి, పద్మ, కొండపల్లి లక్ష్మికాంతమ్మ, సుగుణ, నవ్య, మదళ్లపల్లె శిరీష, జూటూరు కళ్యాణి, పబ్బతి సుధామణి, దొంతంశెట్టి శిరీష, తులసి లక్ష్మిదేవితో పాటు పలువురు మహిళలు కమిటి సభ్యులు దర్శి వెంకటేశ్వర్లు, సముద్రాల పుల్లయ్య, పబ్బతి చక్రపాణి, జొన్నలగడ్డ సుధాకర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు. కనకదుర్గమ్మకు విశేష పూజలు : పట్ట శుక్రవారం ఆలయ కమిటి సభ్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి గాజులతో ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని తమభక్తిని చాటుకున్నారు. భక్తులకు ఆలయ కమిటి సభ్యులు భక్తులకు ప్రత్యేక తీర్థ ప్రసాదాలు అందించారు



## రాజంపేట డయాలసిస్ సెంటర్ ఆకస్మిక తనిఖీ చేసిన సబ్ కలెక్టర్

**రాజంపేట అర్బన్, ఆగస్టు 09, ప్రభాతవార్త:**

రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రిని సబ్ కలెక్టర్ వైఖోమ్ నిదియా శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సంధర్భంగా ఆమె పలు వార్డులను, ఈఐ కేంద్రాన్ని, డయాలసిస్ సెంటర్‌ను పరిశీలించారు. డయాలసిస్ సెంటర్‌లో డయాలసిస్ చేయించుకుంటున్న నూనె వారి పల్లెకు చెందిన సురేష్ మాట్లాడుతూ రాజంపేట డయాలసిస్ సెంటర్‌లో డాక్టర్లు లేరని ఒక యూరాలజి డాక్టర్ ఉండాలని సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకువెల్లారు. తమకు గత మూడు నెలల నుంచి పింఛన్ రావడంలేదని చెప్పారు. మా తల్లి పనిచేస్తే నేను ఈ చికిత్స చేయించుకోవాలని, పింఛన్ రాకపోవడంతో చాలా కష్టంగా ఉందని సబ్ కలెక్టర్‌కు వివరించారు. స్పందించిన సబ్ కలెక్టర్ డయాలసిస్‌లో ఉన్న మేనేజర్‌ను పింఛన్ ఎందుకు రాలేదని అడిగారు. గతంలో వీరు తిరపతి, కడపలో డయాలసిస్ చేయించుకునే వారని, ఈ వివరాలన్నింటిని మళ్లీ కొత్తగా పింఛన్ల మంజూరు అవుతాయని సబ్ కలెక్టర్‌కు తెలిపారు. అనంతరం సూపరిడెంట్ గదికి వెల్లి ఇన్చార్జి వైద్యులు డాక్టర్ అనిల్‌తో సమావేశమయ్యారు. ఆసుపత్రిలో రోగులకు ఎలాంటి సేవలు అందిస్తున్నారని సిబ్బంది, వైద్యులు ఎంతమంది ఉన్నారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి సూపరింటెంట్ ఎక్కడికివెళ్లారని అడగగా ఈరోజు సెలవు పెట్టారని ఇన్చార్జి వైద్యులు డాక్టర్ అనిల్ సబ్‌కలెక్టర్‌కు తెలిపారు. ఈ సంధర్భంగా డాక్టర్ సబ్ మాట్లాడుతూ రోగులకు మెరుగైన సేవలను అందించాలని సూచించారు.



## వైవియూ డిగ్రీ బీఎస్సీ బీకాం హానర్స్ 2, 4వ సెమిష్టర్ ఫలితాలలో ఆర్టీడి డిగ్రీ కళాశాల విజయభేరి

**ప్రొద్దుటూరు అర్బన్, ఆగస్టు 09, ప్రభాతవార్త:**



స్థానిక మైదుకూరు రోడ్డులోని రాణి తిరుమల దేవి డిగ్రీ కళాశాల విద్యార్థిని విద్యార్థులు 2024 ఏప్రిల్, మే నెలలో యోగివేమన యూనివర్సిటి వారు నిర్వహించిన 2, 4వ సెమిష్టర్ డిగ్రీ హానర్స్ పరీక్షా ఫలితాలలో చక్కటి ప్రతిభను కనబరిచి యూనివర్సిటి స్థాయిలో అత్యధిక జీపీఏ సాధించారని కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఈ ఫలితాలలో తమ కళాశాల విద్యార్థులైన రెండవ సంవత్సరం, నాలుగవ సెమిష్టర్ బీఎస్సీ హానర్స్ బయో టెక్నాలజిలో ఎస్.బుష్రా ఫిర్దోస్ 9.69/10 జీపీఏ సాధించారని, కేఎస్ రోషన్ 9.51, ఎమ్.మైధిలి 9.51, జీఎస్ సఫాన 9.5 సాధించారు. అలాగే బయో టెక్నాలజి రెండవ సెమిష్టర్ ఫలితాలలో ఎస్.సాజియా 9.75, పీ.సుష్మిత 9.5, ఎం బిల్ కిస్‌జ 9.25, షాహీన్ 9.25 సాధించారు. అలాగే బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ నాలుగవ సెమిష్టర్‌లో కే.యశస్విని 8.01, ఎం.పూజిత 7.84. అలాగే బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ 2వ సెమిష్టర్ ఫలితాలలో ఏ.నాగ సుమిత్ర 9.5, ఎస్.అనిషా అంజుమ్ 9.25, వై.హరిత 9.25, ఎం.గౌస్మిన్ 9.0 సాధించారు. అలాగే 4వ సెమిష్టర్ బీకాం డిగ్రీ సెమిష్టర్ ఫలితాలలో వై,సుగుణ కుమారి 8.98, ఎస్.యాస్మిన్ 8.95, ఎస్.రుబీనా 8.72లు సాధించారు. అలాగే రెండవ సెమిష్టర్ బీకాం డిగ్రీ హానర్స్ ఫలితాలలె ఎం.జబీన్ 9.5, బి.షాహీన్ 9.17, ఎస్.రిజ్వాన భాను 9.17, కే.హేమలత, కే.మహమ్మద్, ఎస్.గౌసియా, ఎస్.యశస్విని 8.92లు సాధించారు. మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థిని, విద్యార్థులను శుక్రవారం ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ రెడ్డితో పాటు కళాశాల కరస్పాండెంట్ తరుణేంద్ర శేఖర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్, ఇన్చార్జి ప్రిన్సిపల్ ఎస్.వెంకటేశ్వర రెడ్డి, డైరెక్టర్ సుబ్బరాయుడు, అధ్యాపకులు, అధ్యాపకేతర బృందం వారిని అభినందించారు.

## వైవియూ డిగ్రీ ఫలితాలలో ఎస్వీడిసి విద్యార్థులకు యూనివర్సిటీ ర్యాంకులు

**ప్రొద్దుటూరు అర్బన్, ఆగస్టు 09, ప్రభాతవార్త:**



స్థానిక శ్రీ కృష్ణ గీతాశ్రమంలోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల విద్యార్థులు వైవియు విడుదల చేసిన 2, 4వ సెమిష్టర్ ఫలితాలలో యూనివర్సిటి ఫస్ట్ ర్యాంకులు సాధించారని కళాశాల కరస్పాండెంట్ హరి నారాయణ తెలిపారు. ఈ ఫలితాలలో భాగంగా రెండవ సెమిష్టర్ ఫలితాలలో బిఎస్సీ హానర్స్ జువాలజిలో మంజులత, మాధవి, తేజస్వినికి 10కి 10 జీపీఏ, బిఎస్సీ బయోటెక్నాలజిలో జ్ఞాన శ్రీ 10కి 10 జీపీఎ సాధించారని వివరించారు. అదేవిధంగా బిఎస్సీ జువాలజిలో తస్లిమ్, చందన, లాలస, ప్రవీణలు 9.75, శాంతి, ఆస్మా, సాత్విక 9.50, స్నేహ, తన్మయ్ 9.25, నిత్య, తేజస్విని 9.17, తస్లీమ్, దేవిక 9 జీపీఏ, బిబిఏ కోర్సులో అమీర్ బాష 9.75, గంగా మహేశ్వరి 9.33, బిసిఏలో నూరిన్ 9.42, జయశ్రీ 9, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్‌లో సుప్రజ 9.42, లక్ష్మిప్రసన్న 9, బీకాంలో హసినా 9.50, పరిమళ 9.17, 4వ సెమిష్టర్ ఫలితాలలో బీఎస్సీ బైజడ్సీ గ్రూప్‌లో షబానా 9.76, రిహానా 9.71. సమియా, అనుష్క, అల్యురాణి 9.55, సుశీల్ 9.40, మానస 9.31. అపర్ణ, రుబీనా, సమ్రీన్ 9.28, నవ్య, ముస్కాన్ 9, ఎంఎస్సీఎస్ విభాగంలో రవికిరణ్ 7.76. బికాంలో ధణశ్రీ 8.95, బిబిఏలో వినయ్ 8.66 సాధించారని వివరించారు. కాగా ఈ విజయం సాధించిన విద్యార్థిని, విద్యార్థులను శుక్రవారం ఆయనతో పాటు ప్రిన్సిపాల్ మహ్మద్ ముస్తఫా, వైస్ ప్రిన్సిపాల్ శారద, ఇంచార్జ ప్రిన్సిపాల్ రామమోహన్, హెచ్ఒడీలు మౌనయ్య, అజ్రా, గౌరీశంకర్, గంగా భవాణీలు అభినందించారు.

## మంత్రి నారా లోకేష్‌ను కలిసిన మల్లెల శ్రీవాణి

**రాజంపేట అర్బన్, ఆగస్టు 09, ప్రభాతవార్త:**



రాజంపేటను అభివృద్ధి పధంలో నడిపించాలని రాష్ట్ర మంత్రి వర్యులు నారా లోకేష్‌ను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు, మున్సిపల్ మాజీ చైర్మెన్ మల్లెల శ్రీవాణి కలిసి కోరారు. విజయవాడ సచివాలయంలో మర్యాదపూర్వకంగా మంత్రిని కలిశారు. ఈ సంధర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపల్ పట్టణ అభివృద్ధికి నిధులు కేటాయించి రోడ్లు, డ్రైనేజీలో ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరినట్లు చెప్పారు. రాజంపేట గర్ల్స్ హైస్కూల్‌లో అధ్యాపకుల కొరత ఉందని సిబ్బందిని నియమించి హైస్కూల్ బిల్డింగ్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు.

## ఇంచార్జ్ ఎంపీడీఓగా నాగేంద్ర బాబు

**దువ్వూరు, ఆగస్టు 09, ప్రభాతవార్త:**

దువ్వూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓగా పనిచేస్తున్న సుగుణ శ్రీ బదిలీలలో భాగంగా నంద్యాల జిల్లాకు బదిలీ చేశారు. ఆమె స్థానంలో ఇంచార్జ్ ఎంపీడీఓగా నాగేంద్ర బాబును నియమించారు. సుగుణ శ్రీ ఎన్నికల విధుల్లో భాగంగా దువ్వూరు మండలానికి ఎంపీడీఓగా బదిలీపై వచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎంపీడీఓలు అందరూ తమ సొంత జిల్లాలకు బదిలీ చేస్తూ ఇటివల రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అందులో భాగంగా శుక్రవారం ఎంపీడీఓ సుగుణ శ్రీ బదిలీపై వెళుతూ ఎంపీడీఓ బాధ్యతలను నాగేంద్ర బాబుకు అప్పగించారు.

## బీజేవైఎం జిల్లా కార్యదర్శిగా పృథ్వి నారాయణ

**ప్రొద్దుటూరు, ఆగస్టు 09, ప్రభాతవార్త:**




బీజేవైఎం జిల్లా కార్యదర్శిగా అరకటవేముల పృథ్వీ నారాయణను నియమించారు. శుక్రవారం ఈనెల 11 నుంచి 13వ తేది వరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమం చేపట్టాలని ప్రధాని నరేంద్ర మోడి పిలుపునిచ్చిన నేపధ్యంలో ఈ కార్యక్రమ దిశా నిర్దేశం కోసం మండల స్థాయి నాయకులతో జిల్లా అధ్యక్షులు శశిభూషన్ రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భాగంగా భారతీయ జనతా యువ మోర్చా జిల్లా అధ్యక్షులు బొమ్మన విజయ్, బీజేవైఎం జిల్లా కమిటీ నందు బీజేవైఎం జిల్లా కార్యదర్శిగా అరకటవేముల పృధ్వీనారాయణను నియమిస్తున్నట్లు నియామక పత్రం అందజేశారు. ఈ సంధర్భంగా పృధ్వీ నారాయణ మాట్లాడుతూ పార్టీ తనపై ఉంచినటువంటి బాధ్యతను సమర్ధవంతంగా నిర్వహిస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రటరీ సుబ్బారెడ్డి, ఉట్టి శ్రీను, కడప జిల్లా ఇన్చార్స్ వెంకటేశ్వర్ రెడ్డి, ప్రొద్దుటూరు అసెంబ్లీ కో కన్వీనర్ పర్లపాడు గౌరీశంకర్, అరకటవేముల హరినారాయణ మరియు భారతీయ జనతాపార్టీ నాయకులు పాల్గొన్నారు.

## సెమిష్టర్ ఫలితాలలో సత్తా చాటిన వేదవ్యాస విధ్యార్థులు

**ప్రొద్దుటూరు అర్బన్, ఆగస్టు 09, ప్రభాతవార్త:**



యోగివేమన యూనివర్సిటి డిగ్రీ సెమిష్టర్ పరీక్షా ఫలితాలలో శ్రీ వేదవ్యాస డిగ్రీ కాలేజి విద్యార్థి, విద్యార్థినులు యూనివర్సిటి స్థాయిలో మంచి ప్రతిభ కనబరిచారని కరస్పాండెంట్ నాగేశ్వర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రెండవ సెమిష్టర్ బియస్సీ విభాగంలో వి.మన్విత రెడ్డి 9.75. జి.గౌస్ బి 9.17, సాజిదా రెహమాని 9.08, బి.కామ్ (కంప్యూటర్) విభాగంలో జి.మౌనిక 9.00. యస్.అర్షియా 8.92, పి.భారతి 8.75, నాల్గవ సెమిష్టర్ యంపీసీఎస్ విభాగంలో ఎ.నాగ సుష్మిత 9.23, యస్.చాంద్ బి 8.87, యంయస్‌సీఎస్ విభాగంలో కె.అనూష 8.53, జె.ఆయేషా 8.28. బి కామ్(కంప్యూటర్) విభాగంలో ఎస్.అతిఫా బాను 9.10, కె.పూజిత 9.02, మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రెసిడెంట్ జి.సుదర్శణ రెడ్డి, యన్‌యస్‌యస్ కోఆర్డినేటర్ రామలక్ష్మిరెడ్డి, నాగరాజు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

## రిమ్స్‌పై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్‌ను కలిసిన బీజేవైఎం జిల్లా అధ్యక్షులు బొమ్మన విజయ్



**కడప కార్పొరేషన్, ఆగస్టు 9, ప్రభాతవార్త:**
రిమ్స్‌లో అధికారుల నిర్లక్ష్యం, అపరిశుభ్రత, రోగులు ఎదుర్కొంటు న్న ఇబ్బందులపై వైద్య ఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్‌ను బీజేవై ఎం నాయకులు కలిసి వివరించారు. మంత్రి వెంటనే స్పందించి త్వరలో రిమ్స్ ఆసుపత్రిని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని బీజేవైఎం నాయకులు హామీ ఇవ్వడం జరిగిం ది. ఈ సందర్భంగా బీజేవైఎం జిల్లా అధ్యక్షులు బొమ్మన విజయ్ మాట్లా డుతూ కడప రిమ్స్‌ను మంగళవారం బీజేవైఎం నాయకులతో కలిసి వార్డు వార్డులు పరిశీలించి సమస్యలు తెలుసుకోవడంతో పాటు రోగులతో మాట్లాడి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నామన్నారు. ఆసుపత్రిలో అపరిశుభ్రత అనేది ప్రధాన సమస్యగా ఉందన్నారు. గత 20 సంవత్సరాలుగా వారసత్వంలా ఔట్ సోర్సింగ్ కాంట్రాక్టర్ బాల నాగిరెడ్డి కొనసాగడం జరుగుతోందని తెలిపారు. ప్రభుత్వం మారినా మాజీ సీఎం ఫొటోలు ఇంకా మార్చడం లేదని తెలిపారు. ప్రజలు వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ రిమ్స్‌కు పోతే సమస్యలు వవారికి స్వాగతం పలుకుతున్నాయని ఇక్కడ డాక్టర్లు ప్రభుత్వం వేతనాలు తీసుకుంటున్న విషయాన్ని విస్మరించి ఇష్టారాజ్యంగా వ్యవహరించడంపై రిమ్స్‌కు గత పాలకుల పరిధిలో ఉందనిపిస్తోందన్నారు. ఆసుపత్రిలో చికిత్స కోసం వచ్చిన వారి సహాయకులకు వసతులు కల్పించాల్సిం దిగా రిమ్స్ ఆసుపత్రి వ్యవహారంపై పేద ప్రజలకు అత్యుత్తమ వైద్యం అందించాలని రాష్ట్ర ఆరోగ్య వైద్య శాఖామంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శులు సురేంద్ర, అశోక్‌కుమార్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా కార్యదర్శి ఓబులయ్య, సోషల్ మీడియా కన్వీనర్ సాయి ఈశ్వర్, బీజేవైఎం నాయకులు వినోద్‌కుమార్‌రెడ్డి, చంద్ర పాల్గొన్నారు.

## పీహెచ్‌సీలో కాన్పులు పెంచాలి

డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొండయ్య



**పీలేరు, ఆగస్టు 09 ప్రభాతవార్త:**
నియోజకవర్గంలోని వాల్మీకిపురం పీహెచ్‌సీల్లో కాన్పులు పెరిగేలా గ్రామీణ ప్రాంతాల్లో గర్భవతులు, వారి కుటుంబ సభ్యులకు అవగా హన కల్పించి ఆసుపత్రిలో కాన్పులు జరిగేలా చూడాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొండయ్య ఆదేశించారు. శుక్ర వారం ఫ్రైడే డ్రై డే మరియు 9వ తేదీ ప్రధానమంత్రి సురక్షిత మాత త్వ అభియాన్ కార్యక్రమంలో భాగం గా చింతపర్తి పీహెచ్‌సీని ఆకస్మికం గా తనిఖీచేశారు. తనికీలో భాగంగా డ్రగ్స్ స్టోర్స్ పరిశీలించి అత్యవసర మందులు అందుబాటులో ఉంచుకోవాలని ఫార్మసిస్టును ఆదేశించారు. డెలివరీ గదిని పరిశీలించి ఆక్సి జన్ అందుబాటులో ఉంచుకుని ఉపయోగించుకోవాలని స్టాఫ్ నర్సు నరసమ్మను ఆదేశించారు. అనంతరం హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి స్టాఫ్‌నర్సులకు రోస్టర్ అమలు చేస్తున్నారా అని వైద్యులు డాక్టర్ జులేఖబేగంను అడిగి తెలుసుకున్నారు. పీఎంఎస్ఎమ్‌ఏ కార్యక్రమంకు వచ్చిన గర్భవతులను అడిగి వారికి అందుచున్న సేవల గురించి ఆరా తీశారు. అనంతరం సిబ్బందికి సీజినల్ వ్యాధులపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం చింతపర్తి గ్రామంలో బీసీ కాలనీలో నిర్వహిస్తున్న ఫ్రైడే డ్రైడే కార్యక్రమం తనిఖీచేశారు. వీదుల్లో మురుగు కాల్వలు లేని చోట ఇంకుడు గుంతలు ఏర్పాటుచేసుకోవాలని గ్రామస్తులకు తెలిపారు. ప్రతీశుక్రవారం పొడి దినంగా పాటిస్తే దోమలు వద్ది చెందవని అన్నారు. పీహెచ్‌సీ, ప్రాంగణం శుభ్రంగా ఉందని పీహెచ్‌సీ సేవల పట్ల సంతప్తి వ్యక్తం చేశారు.కార్యక్రమంలో వైద్యులు జులేఖ, సన అయేషా, మహమ్మద్‌రఫీ, సుధాకర,బానుబీ, సురేష్, కరుణ, నరసమ్మ ఆశకార్యకర్తలు ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

## క్విట్ కార్పోరేట్ ఇండియా నిరసన చేపట్టిన కార్మిక, రైతు సంఘాల నాయకులు

**పోరుమామిళ్ల రూరల్, ఆగస్టు 9 (ప్రభాతవార్త):**




పోరుమామిళ్ల అంబేద్కర్ భవనం నందు శుక్రవారం ట్రేడ్ యూనియ న్ కార్మిక రైతుల సంఘాల నాయకు లు క్విట్ కార్పోరేట్ ఇండియా నరసన కార్యక్రమాన్ని నిర్వహించా రు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆ సంఘం నాయకులు భైరవప్రసాద్ లక్ష్మిదేవి, బసిరెడ్డి లక్ష్మిదేవిలు మాట్లాడుతూ ఆదాని, అంబాని లాంటి కార్పోరేట్ కంపెనీల నుండి రైతుల వ్యవసాయాన్ని కాపాడాలని కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దుచేయాలని క్విట్ ఇండియాడే సందర్భంగా నిరసన తెలిపారు. 1942 ఆగస్టు 9న నాటి బ్రిటీష్ సామ్రాజ్యవాధులు దేశం విడిచి వెళ్లిపోవాలంటే క్విట్ ఇండియా ఉద్యమం జరిగందని , ఆ స్ఫూర్తితో రైతుల వ్యవసాయాన్ని, కార్మిక హక్కులను కాలరాస్తున్న కార్పోరేట్ కంపెనీలు దేశం విడిచి వెళ్లిపోవాలంటూ కార్పోరేట్ క్విట్ ఇండియా నినాదంతో నిరసన చేపట్టారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలపై పన్నుల భారం తగ్గించి ప్రభుత్వ ఆదాయం కోసం కార్పోరేట్ కంపెనీలపై పన్నుల భారం పెంచాలని కోరారు.ఈ సమావేశంలో ట్రేడ్ యూనియన్ కార్మిక రైతు సంఘాల నాయకులు, అంగన్వాడీ నాయకులు, సీఐటీయూ జిల్లా కమిటి సభ్యురాలు ఓబుళాపురం విజయమ్మ, మేరి, దస్తగిరమ్మ,జ్యోతమ్మ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ కార్యక్రమంపై అవగాహన



**కాశినాయన, ఆగస్టు 9 (ప్రభాతవార్త):**
ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ కార్యక్రమంపై శుక్రవారం నర్సాపురం పీహెచ్‌సీలో డాక్టర్ బిఎస్ఎన్ ప్రశాంతి గర్భిణిలు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా పలువురు గర్భిణీలకు రక్తపరీక్షలు, షుగర్ పరీక్షలు చేయడం జరిగింది. అలాగే హైరిస్క్ గర్భవతులను గుర్తించి వారికి సలహాలు, సూచనలు ఇవ్వడం జరిగింది. అంగన్వాడీలు ఇచ్చే ఆహారం ఖచ్చితంగా ఉపయోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్మల, శారద, తదితరులు పాల్గొన్నారు.

## మాతశిశు సంక్షేమం ఆరోగ్య పరీక్షలతో సాధ్యం

డాక్టర్ రమేష్‌రెడ్డి



**పీలేరు, ఆగస్టు 09 ప్రభాతవార్త:**
గర్భిణీ సమయంలో వచ్చే ఆరో గ్య సమస్యలు, ఆరోగ్యపరీక్షలతో పరిష్కారమవుతాయని డాక్టర్ రమే ష్‌రెడ్డి గర్భిణీస్త్రీలకు హితవు పలికా రు. శుక్రవారం తలపుల పీహెచ్‌సీ లో నిర్వహించిన ప్రధామంత్రి సుర క్షిత మాతత్వ అభియాన్ కార్యక్ర మంలో భాగంగా ప్రధాన వైద్యాధి కారి రమేష్‌రెడ్డి మాట్లాడుతూ గర్భి ణీ కాలంలో తల్లి అనారోగ్యం ప్రభావం బిడ్డ ఆరోగ్యంపై చెడు ప్రభావం పడకుండా ఆరోగ్య పరీక్షల ఆవశ్యకతను గర్భిణీలకు వివరించారు. చక్కెర వ్యాధి, అధిక రక్తపోటు, బరువు పెరుగుదల, రక్తహీనత తదితర వ్యాధుల నిర్ధారణ పరీక్షలు నిర్వహించి అవసరమగు సూచన సలహాలతోపాటు ఐరన్ ఫోలిక్‌యా సిడ్, కాల్షియం మందులు పంపినీ చేశారు. కష్ణయ్య సహకారంతో హాజరైన 27 మంది గర్భిణీ స్త్రీలకు రొట్టెలు, పండ్లు, పాలు పంపినీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య పర్యవేక్షకులు కష్ణ య్య, ఏఎన్ఎం ఫామున్నీసా, లావణ్య, కుముదా, ఆశ కార్యకర్తలు గర్భిణీస్త్రీలు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ ఆదివాసి దినోత్సవం వేడుకలు



**పీలేరు, ఆగస్టు 09 ప్రభాతవార్త:**
ఆంధ్రప్రదేశ్ గిరిజన యానాది సేవా సంఘం (ఏపీజీవైఎస్ఎస్) ఆ ద్వర్యంలో ప్రపంచ ఆదివాసి దినో త్సవం స్థానిక డాక్టర్ బీఆర్ అంబే ద్కర్ కూడలిలో ఘనంగా నిర్వహిం చారు. వివిధ ప్రజా సంఘనాయకు లు అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాలులు అర్పించారు. జై ఆదివాసి, జైజై ఆదివాసి ఎస్సీ, ఎస్టీ బీసీ మైనారి టీల ఐక్యత వర్ధిల్లాలి అని నినాదాలు చేశారు. ఈసందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యులు పులి శ్రీనివాసులు, జానం గంగిరెడ్డి ప్రపంచ ఆదివాసి దినోత్సవం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ ఆదివాసి దినోత్సవం కేవలం వేడుకల రోజు మాత్రమే కాదు, ఆదివాసిల ప్రత్యేక సంప్రదాయాలు, బాషలు, గిరిజనులు జ్ఞాన వ్యవస్థలను పరిరక్షించడం సమాజ సాంస్కతిక వైవిద్యానికి అవి ఎంత ముఖ్యమైనవో వివరించారు. ఆదివాసీల సాంప్రదాయ పద్ధతుల ద్వారా ప్రకతిని కాపాడడంలో, సహజ వనరులను సంరక్షించడంలో ఆదివాసులు కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. గిరిజ నుల హక్కులను గుర్తించడమే కాదు, గౌరవించడం కూడా సమాజ బాధ్యత అన్నారు. భూస్వామ్య హక్కు లు, విద్య, ఆరోగ్య సేవలకు ప్రాప్తి విషయంలో ఆదివాసులు ఇప్పటికీ సమాజంలో వివక్షతకు గురవుతు న్నారని ఇతర ప్రధాన సామాజిక ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. ఆదివాసి అభిప్రాయాలను జాతీయ రాష్ట్ర విధానాల్లో సమగ్రపరిచి కషిచేయాల్సి న అవసరం ఎంతైనా ఉందన్నారు. పై కార్యక్రమంలో పై సంఘం నాయకులు చుక్కలపాటి ఆదినారాయణ, గిరిజన నాయకులు కిల్లా విజయ్‌కుమార్, మాల మహానాడు రాష్ట్ర నాయకులు ధరణికుమార్, బాస్ నాయకులు పాలకుంట శ్రీనివాసులు, గట్టప్ప, ఎంఎస్‌పీ నియోజకవర్గ ఇన్‌చార్జి గండికోట వెంకటేష్, బీసీ సంఘం నాయకులు మహేష్‌యాదవ్, మేము సైతం సమాజం కోసం అధ్యక్షులు షాహిన్‌షా, బుజ్జు, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

## దానాలన్నింటిలో కెల్లా అన్నదానం గొప్పది

**రాయచోటి, ఆగస్టు 9, ప్రభాతవార్త:**
వీరబల్లిలోని ప్రభుత్వ వైద్య శాలలో గర్భిణీ స్త్రీ మహిళలకు వీరబల్లి ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదానం మహా గొప్పదానమన్నారు. వారంలో ప్రతి శుక్రవారం గర్భిణీ స్త్రీలకు అన్నదానం వసతి కల్పించడం జరిగిందని ఇది గత కొన్ని నెలలుగా ఆనవాయితీగా వస్తోందన్నారు. వారితో పాటు ఆసుపత్రి సిబ్బందికి కూడా భోజనం కల్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బందితో పాటు పలువురు గర్భిణీ స్త్రీలు పాల్గొన్నారు.

## చిట్వేలి ఎంపీడీవోకు సన్మానం



**చిట్వేలి, ఆగస్టు 9, ప్రభాతవార్త:**
చిట్వేలి ఎంపీడీవో వెంకట రంగా రావును శుక్రవారం ఘనంగా సన్మా నించారు. సార్వత్రిక ఎన్నికల్లో భా గంగా ఆయన అనంతపురం జిల్లా నుంచి బదిలీపై చిట్వేలి ఎంపీడీవోగా వచ్చారు. తిరిగి సొంత జిలాలకు బదిలీ ఉత్తర్వులు వచ్చాయి. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది సచివాలయ సిబ్బంది, మండల విద్యాశాఖాధికారులు సం యుక్తంగా కార్యక్రమాన్ని నిర్వహించారు.

## ప్రపంచ ఆదివాసి దినోత్సవం

**జమ్మలమడుగు, ఆగస్టు 9, ప్రభాతవార్త:**
ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని పురస్కరించుకొని జమ్మలమడుగు శబరి కాలనీలో బీజేపీ గిరిజన మోర్చా నాయకులు వనం హరి ఆధ్వర్యంలో ఆదివాసి నాయకులు బిర్సా ముండా గారి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వనం హరి మాట్లాడుతూ ఆదివాసుల హక్కుల కోసం ప్రాణాలైన అర్పిస్తామని ప్రతి ఒక్క గిరిజన బిడ్డ జాతి యొక్క అభివృద్ధి పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా నాయకులు మేకల ఆంజినేయులు, రాజశేఖర్, గిరిజన మోర్చా నాయకులు శ్రీరాములు వంశీ, ప్రసాద్, వనం సుబ్బమ్మ, వనం రాజన్న, శ్రీరాములు తులసీ, కండ్లి నాగమ్మ, సుంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ సేన రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా ముత్యాల ప్రసాద్‌రావు ఎన్నిక



**పోరుమామిళ్ల రూరల్, ఆగస్టు 9 (ప్రభాతవార్త):**
అంబేద్కర్ సేన రా ష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా ముత్యాల ప్రసాద్‌రావు ఎన్నుకున్నట్లు ఆ సంఘం సెక్రటరీ రెడ్డిమల్ల శ్రీనివాస్ తెలిపారు. ఈ సంద ర్భంగా ప్రసాద్‌రావు మాట్లాడుతూ పేదలు తమ సమస్యలు ఏవైనా ఉంటే వాటిని తన దృష్టికి తెచ్చినట్లయితే అధికారులు మరియు ప్రభుత్వం దృష్టికి వాటిని తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషిచేస్తానన్నారు. తనకు ఈ బాధ్యతను అప్పగించిన శ్రీనివాస్‌కు ధన్యవాదాలు తెలిపారు.

## పీలేరు పట్టణ సీఐగా యుగంధర్ పదవీ బాధ్యతలు



**పీలేరు, ఆగస్టు 09 ప్రభాతవార్త:**
పీలేరు అర్బన్ సీఐగా యుగంధర్ పదవీ బాధ్యతలు శుక్రవారం స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ మోహన్‌రెడ్డి బదిలీపై రాయచోటి వీఆర్ బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో వైఎస్సార్ జిల్లా బద్వేలులో సీఐగా పనిచే స్తున్న యుగందర్ బదిలీపై పీలేరుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణే ప్రధాన లక్ష్యమన్నారు.

## ఒంటిమిట్ట ఎత్తిపోతల పథకం పునరుద్ధరించాలి

భూ అక్రమాలపై చర్యలు తీసుకోవాలని : తహసీల్దార్‌కు టిడిపి నేతల వినతి



**రాజంపేట అర్బన్, ఆగస్టు 09, ప్రభాతవార్త:**
ఒంటిమిట్ట చెరువు పంపింగ్ స్కీంకు మరమ్మత్తు చేసి చెరువుకు నీరు నింపేలా చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకోపోవాలని తెలుగుదేశం నాయకులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అలాగే మండలంలో జరిగిన భూ అక్రమాలపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర కల్లు గీత ఆర్థిక సహకార సంస్థ మాజీ డైరెక్టర్ కొమర వెంకట నరసయ్య ఆధ్వర్యంలో మండల తెలుగుదేశం నాయకులు శుక్రవారం ఒంటిమిట్ట మండల తహసీల్దార్ రమణమ్మను కలిసి విజ్ఞప్తి చేశారు. గత నాలుగు సంవత్సరాలు ఒంటిమిట్ట చెరువుకు నీరు నింపకపోవడంతో చెరువు పరిధిలోని సుమారు 15గ్రామాల్లో ఉన్న వ్యవసాయ బోరు బావులు ఎండిపోవడం జరిగిందన్నారు. సుమారు 600అడుగులు వేసిన కూడ బోర్లలో నీళ్లు పడటం లేదన్నారు. పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని చేతికొచ్చిన అరటి పంట దిగుబడి తగ్గిపోయిందని వారు తెలిపారు. మండలంలో వ్యవసాయ బోర్లు ఎండిపోవడంతో పసుపు, అరటి పంటలు సాగు చేసుకునే రైతులు సకాలంలో పంటలు సాగు చేసుకోలేని దుస్థితి ఏర్పడిందని తెలిపారు. ఒంటి మిట్ట చెరువుకు వెంటనే శ్రీరామ ఎత్తిపోతట పథకం ద్వారా సోమశిల బ్యాక్ వాటర్ నుంచి చెరువుకు నీరు నింపేలా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకుపోవాలని కోరారు. ఒంటిమిట్ట పంపఇంగ్ స్కీం నుండి కోటపాడు పైన ఉన్న సంపు వరకు ఉన్న పైప్‌లైన్ తరచుగా నీటి ఒత్తిడి తట్టుకోలేక పగిలిపోతూ స్కీం పనిచేయకుండా నిలిచిపోతుందన్నారు. ఈ చెరువుకు నీరందిస్తే సుమారు 5000ఎకరాల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా సాగునీరు అందుతుందన్నారు. తక్షణం మరమ్మత్తు పనులు చేపట్టి ఒంటిమిట్ట చెరువుకు నీళ్లు నింపాల్సి న ఆవశ్యకత గురించి జిల్లా కలెక్టర్ వారిని నివేదించాలని వారు తహసీల్దార్‌ను కోరారు. మండలంలో సుమారు 2500 ఎకరాల డికేటి భూములు అన్యాక్రాంతమై పోయాయన్నారు. వీటిపైన సవివరంగా సాక్ష్యాధారలతో సహా అధికారులకు నివేదిస్తామని భూ అక్రమాలకు పాల్పడిన వారిపై ల్యాండ్ గ్రాబింగ్ చట్టం కింద చట్టపరంగా చర్యలు తీసుకొని కేసులు నమోదు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఒంటిమిట్ట మృకుందాశ్రమం ప్రాంతంలో వందలాది ఇంటి పట్టాలను సృష్టించి కోట్లాది రూపాయల పేదల నుండి దోచుకున్నారని అన్ని వివరాలతో ఫిర్యాదు చేస్తామని చర్యలు తీసుకోవాలని ఆమెకు వారు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో జరిగిన విచ్చలవిడిగా జరిగిన భూ దందాలపై ప్రభుత్వం నియమించే హైకోర్టు జడ్జికి ఇతర అధికారులకు గ్రామాల వారిగా త్వరలో ఫిర్యాదు చేస్తామని వారు ఆమెకి తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గం కార్యనిర్వాహక కార్యదర్శి మోదుగుల నరసింహులు, రాష్ట్ర టిడిపి లీగల్ సెల్ కార్యనిర్వాహక సభ్యులు, అడ్వకేట్ రామదాసు, ఒంటిమిట్ట టిడిపి సీనియర్ నాయకులు మామిళ్ల ఈశ్వరయ్య, పెన్నపేరూరు మాజీ ఎంపీటీసీ సభ్యుడు మహబూబ్ సుభాన్, రాయలసీమ బ్యాంక్ మాజీ డైరెక్టర్ బీవీ రమణ, మాధవరం దేశం నాయకుడు చంద్రబాబు, పెన్నపేరూరు దేశం నాయకుడు దున్నుతల రఘురాం రెడ్డి, గొల్లపల్లి వినోద్ రెడ్డి, రేవిళ్ల బాలమునయ్య, మూమిళ్ల రామకృష్ణయ్య, షాదిఖానా మాజి అధ్యక్షుడు సయ్యద్‌చాంద్‌బాష, పత్తి కృష్ణయ్య, ఆర్.లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

## రాజంపేటలో సమస్యల పరిష్కారానికి సబ్ కలెక్టర్‌కు కూటమి నేతల వినతి



**రాజంపేట అర్బన్, ఆగస్టు 09, ప్రభాతవార్త:**
రాజంపేటలో పలు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కూటమి నేతలు సబ్ కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. రాజంపేట రెవెన్యూ డివిజన్ పరిధిలోని భూ అక్రమాలపైన రాజంపేట మున్సిపాలిటీలో డ్రైనేజి, చెత్త సమస్యపైన, రాజంపేట ట్రాఫిక్ సమస్యపైన, రోజు కూలీలు ఎదుర్కొంటున్న ఇసుక క్వారీ ఏర్పాటుపైన ప్రధానంగా దృష్టి సారించాలని కోరారు. రాజంపేటలో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి అయిందని, కొన్ని పనులు పూర్తి కాకపోవడంతో వృధాగా ప్రజలకు అందుబాటులోకి రాని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. సమస్యల పరిష్కారంపై సబ్ కలెక్టర్ సానుకూలంగా స్పందించి పరిష్కరిస్తానని చెప్పడం జరిగిందని అన్నమయ్య జిల్లా బలిజసేన ప్రధాన కార్యదర్శి నీలి ఈశ్వరయ్య, జనసేన పార్టీ ఉమ్మడి కడప జిల్లా లీగల్ ఉపాధ్యక్షులు కత్తి సుబ్బరాయుడు, తెలుగుదేశం పార్టీ అన్నమయ్య జిల్లా ఉపాధ్యక్షురాలు శ్రీవాణి, జనసేన పార్టీ సీనియర్ నాయకులు రామ శ్రీనివాసులు, జనసేన పార్టీ యువ నాయకుడు అబ్బిగారి గోపాల్ పాల్గొన్నారు.

## 9 మంది పేకాట రాయుళ్లు అరెస్ట్



**పెండ్లిమర్రి, ఆగస్టు 9, ప్రభాతవార్త:**
పెండ్లిమర్రి మండలం కొండూరు గ్రామ శివార్లలోని కంప చెట్ల పొద ల్లో పేకాట ఆడుతున్న 9 మంది వ్యక్తులను పట్టుకొని వారి వద్ద నుంచి రూ.11,180, పేక ముక్కల ను స్వాధీనం చేసుకోవడం జరిగింద ని ఎస్సై మధుసూదన్‌రెడ్డి తెలిపా రు. అసాంఘిక కార్యకలాపాలకు పా ల్పడితే కఠిన చర్యలు తప్పవని హె చ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## పెద్దమ్మాయికి బాధ్యత ఎక్కువ..

**చిన్నదానికి దెబ్బ తగిలింది, కూడా ఉన్నావుగా.. చూసుకోలేదా.. అంటూ ఇంట్లో పెద్ద పిల్లలను అజమాయిషీ చేస్తారంతా. తీరా చెల్లెలికన్నా పెద్దమ్మాయిది రెండేళ్లు ఎక్కువ ఉంటుంది. అయినా చిన్నవాళ్ల బాధ్యత పెద్దవాళ్లదే అంటారంతా. దీంతోపాటు పుట్టిన క్రమం పిల్లల వ్యక్తిత్వాన్ని గణనీయంగా ప్రభావితం చేస్తుందంటున్నాయి పలు పరిశోధనలు.**

సంతానంలో పిల్లలు పుట్టే క్రమం వారి స్వభావం, ప్రవర్తనను ప్రభావితం చేస్తాయంటున్నాయి అధ్యయనాలు. అందరికన్నా పెద్దవాళ్లు కుటుంబం లో బాధ్యతగా, నాయకత్వ స్థానంలో ఉంటాయి. తల్లి దండ్రుల ఏకాగ్రత, అడిగిందల్లా పొందడం వంటివన్నీ ముందుగా వీరికే దక్కుతాయి. దీంతో అందరి ప్రేమ దక్కి తాము కూడా స్నేహభావంతో ఉంటారు. తన తర్వాత పుట్టిన పిల్లల బాధ్యత రావడంతో బాధ్యతాయుతంగా మారతారు. తమ్ముడు అల్లరి చేస్తే తప్పు అని చెప్పాలి కదా అనే తల్లిదండ్రుల మాటలతో తనకన్నా చిన్న వారికి తాను రోల్‌మోడల్‌గా ఉండాలనే వ్యక్తిత్వం వస్తుంది.

**మధ్యవాళ్లు..** తనకన్నా పెద్దవాళ్లు, చిన్నవాళ్లకు మధ్య సతమతుల్యంగా ఉంటారు. తమకంటూఐ గుర్తింపు పొందడానికి కృషి చేస్తూ, నైపుణ్యాలను పెంచుకుంటారు. తమకన్నా పెద్దవారికి, చిన్నవారికి సహకారానినన అందిస్తూ, వాళ్ల మధ్య వచ్చే విభేదాలకు మధ్యవర్తిత్వం వహిస్తారు. ఇక, చివరి పిల్లలు పుట్టే సమయానికి తల్లిదండ్రులకు పెంపకంలో అనుభవం వస్తుంది. ఒత్తిడికి గురికాకుండా పెంచడంవల్ల ఈ పిల్లల్లో ఆందోళన ఉండదట. అందరి ప్రేమ పొంది గారంగా పెరుగుతారు. నిర్లక్ష్యం వైఖరి వస్తుంది. నియమాలు, నిబంధనలు సడలి సాహసోపేతంగా ఉంటారు.

**ఒకే ఒక్కరైతే...** తల్లిదండ్రుల నుంచి ఎక్కువ ప్రేమ దొరుకుతుంది. పోటీ లేకుండా పెరుగుతారు. మనసుకు నచ్చింది చేస్తారు. అమ్మానాన్నతో ఎక్కువ గడుపుతారు. అయితే అనుకున్నది అందకపోతే తీవ్రమైన ఒత్తిడికి గురవుతారు. ఉన్నతవిద్యను అభ్యసించడంలో, సామాజిక నైపుణ్యాలను పెంపొందించుకోవడంలో ముందుంటారట.

# తుప్పుపడుతున్న విద్యుత్ ఐరెన్‌పోల్స్

- పట్టించుకోని విద్యుత్‌శాఖ అధికారులు - ప్రభుత్వానికి లక్షలాది రుపాయలు నష్టం

**మదనపల్లె, ఆగస్టు 9 ప్రభాతవార్త :**
పట్టణంలో పలుచోట్ల ఇటీవల విద్యుత్ పోల్స్ మార్పిడి జరిగింది. ఐరెన్‌పోల్స్ ఉన్నచోట సిమెంటు పోల్స్‌ను అమర్చారు. అయితే వెలికి తీసిన విద్యుత్ ఐరెన్‌పోల్స్ ఎక్కడి పడితే అక్కడే వదిలివేయడంతో తుప్పు పడుతున్నాయి. వీటి గురించి విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రభుత్వానికి లక్షలాది రుపాయల నష్టం వాటిల్లుతోందని పలువురు చెబుతున్నారు. సాధారణంగా విద్యుత్ పోల్స్ మార్చినపుడు అక్కడ ఉన్న పాత పోల్స్‌ను తీసిన వెంటనే ఒకచోట చేర్చి స్టోర్‌రూమ్‌కు తరలించాల్సి ఉంది. అయితే అధికారులు వీటి గురించి పట్టించుకొన్న పాపానలేదు. కిందిస్థాయి ఉద్యోగులు ఎక్కడ పడితే అక్కడ ఐరెన్ పోల్స్‌ను వదిలివేయడంతో కొందరు చోరీలు కూడా చేస్తున్నట్లు తెలుస్తోంది. సాధారణంగా ఒక విద్యుత్ పోల్ అమ



ర్చాలంటూ ఎంతో ఖర్చు చేయాల్సి ఉంటుంది. అలాంటిది విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల ఎంతో విలువ చేసే విద్యుత్ ఐరెన్‌పోల్స్ పనికిరాకుండా తుప్పు పడుతున్నాయి. ఈ విషయంపై ట్రాన్స్‌కో ఈఈ గంగాదరంను వివరణ కోరగా పట్టణంలో పోల్స్‌మార్పిడి సందర్భంగా బయట ఉన్న ఇనపు పోల్స్‌ను స్టోర్‌రూమ్‌కు తరలించేందుకు చర్యలు తీసుకొంటామన్నారు.

## సోషల్ ఆడిట్ గ్రామసభ వాయిదా

**తంబళ్లపల్లె, ఆగస్టు 9, ప్రభాతవార్త:**
తంబళ్లపల్లె మండలంలో గత 10 రోజులుగా ఉపాధి హామీ కరవు పనులతో పాటు అభివృద్ధి పనులు, సామాజిక పెన్షన్లపై సోషల్ ఆడిట్ బృందం ముమ్మరంగా తనిఖీలతో పాటు గ్రామ స్థాయి సమావేశాలు పూర్తి చేశారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో జరగాల్సిన సామాజిక బహిరంగ సభ కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్లు ఎంపీడీవో కృష్ణమూర్తి, ఏపీవో అంజనప్పలు తెలిపారు. తదుపరి గ్రామ సభ తేదీని త్వరలో ప్రకటిస్తామని విలేకరులకు తెలిపారు.

## తాగునీటి కాలుష్యంపై విస్తృత పరీక్షలు

**తంబళ్లపల్లె, ఆగస్టు 9, ప్రభాతవార్త:**
తంబళ్లపల్లె మండలంలో ఈ మధ్య కాలంలో వర్షాభావంతో మలేరియా, డయేరియా, డెంగీ, విష జ్వరాలు సోకుతున్న విషయం తెలిసిందే. ఈ విషయమై ఎంపీడీవో కృష్ణమూర్తి ఆదేశాల మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అశోక్ తంబళ్లపల్లి మండలంలో పలు గ్రామాల్లోని తాగునీటి బోర్లలోని తాగునీరు పరీక్షలు నిర్వహించడానికి చర్యలు చేపట్టారు. శుక్రవారం మండలంలోని ఎద్దులవారిపల్లి, ఎర్రసానిపల్లె, కన్నెమడుగు, పంచాలమర్రి పంచాయతీల్లో తాగునీటి బోర్లలోని నీటిని జలజీవన్ మిషన్‌కు చెందిన అధికారులు తాగునీటిని పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు వారు లో ఫ్లోరిన్ శాతం తక్కువగా ఉందని తాగునీటి బోర్లలోని నీటిని నిర్భయంగా తాగవచ్చని హామీ ఇచ్చారు. గ్రామాల్లోని ప్రజలు వ్యక్తిగత పారిశుద్ధ్యంతో పాటు పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని చెత్త దిబ్బలను తొలగించి తాగునీటిని కాచి వడబోసి తాగాలని విధిగా దోమల నివారణకు దోమతెరలు వాడాలని సూచించారు.

## 12 నుంచి సర్పంచులకు శిక్షణా తరగతులు

**తంబళ్లపల్లె, ఆగస్టు 9, ప్రభాతవార్త:**
అన్నమయ్య జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు తంబళ్లపల్లె మండలంలోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు 3 రోజుల పాటు శానిటేషన్ మరియు సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ జీపీడీపీ స్ర్కూటినీపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కృష్ణమూర్తి తెలిపారు. ఈనెల 12 నుంచి ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు శిక్షణ తరగతులుంటాయన్నారు. మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు కచ్చితంగా హాజరై పంచాయతీల అభివృద్ధి కోసం సహకరించాలని కోరారు.

## భక్తిశ్రద్ధలతో నాగులపంచమి వేడుకలు

**గాలివీడు, ఆగస్టు 9(ప్రభాతవార్త):**



నాగుల పంచమి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలో మహిళలు పెద్ద సంఖ్యలో నాగదేవత పుట్టలను దర్శించుకున్నారు. పవిత్ర శ్రావణ మాసంలో శుక్రవారం వచ్చిన నాగపంచమిని పురస్కరించుకొని మహిళలు ఉదయమే నూతన వస్త్రాలు ధరించి వివిధ దేవాలయాలు గ్రామాల్లో ఉన్న పుట్టల వద్దకు చేరుకొని నాగదేవతలకు పాలు, పళ్లు, ఫలహారాలు, పువ్వులు సమర్పించారు. మహిళలతో పాటు పురుషులు సైతం నాగదేవతలకు పాలు పోసి పూజలు నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో మహిళలు పూజలు నిర్వహించారు. సుఖశాంతులు ప్రసాదించాలని నాగదేవతను వేడుకున్నారు.

## 12 నుండి సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ

**గాలివీడు, ఆగస్టు 9(ప్రభాతవార్త):**
మండలంలో ఎన్నికైన సర్పంచులకు, గ్రామ పంచాయతీలో పనిచేయుచున్న పంచాయతీ కార్యదర్శులు గ్రేడ్ 1 నుండి 5 వరకు వీరందరికీ వైఎస్ఆర్ జిల్లా నందు మూడు రోజుల పాటుగా అనగా 12 నుండి 14వ తేదీల వరకు రిఫ్రెషర్ శిక్షణా కర్యాక్రమం జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం వారి ఆధ్వర్యంలో జరుగునని శుక్రవారం ఎంపీడీఓ శ్రీనివాసులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం ప్రిన్సిపల్ మరియు జిల్లా పరిషత్ అధికారి అయిన ఎం.సుధాకర్‌రెడ్డి, జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం వైస్ ప్రిన్సిపల్ మరియు జిల్లా పంచాయతీ అధికారి డి.ప్రభాకర్‌రెడ్డి హాజరుకానున్నారని తెలిపారు.

## పొలంబడితో నాణ్యమైన ఆహారోత్పత్తులు



**గాలివీడు, ఆగస్టు 9(ప్రభాతవార్త):**
పొలంబడి కార్యక్రమంతో రైతులు పురుగుమందులు అవశేషాలు లేని నాణ్యమైన ఆహారోత్పత్తులు సాధించవచ్చని లక్కిరెడ్డిపల్లి వ్యవసాయ సంచాలకులు జయరాణి తెలిపారు. శుక్రవారం మండలంలోని నూలివీడు గ్రామంలో వ్యవసయాధికారి మురళీధర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పొలంబడి కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు అనుసరించాల్సిన యాజమాన్య పద్ధతులు వేరుశనగ పంటలో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు, విత్తనం నుండి విక్రయం వరకు క్లుప్తంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతు సేవా కేంద్ర ఇన్‌ఛార్జ్‌లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల పరిశుభ్రత భాధ్యత సర్పంచ్‌లదే

**జిల్లా పంచాయితీ అధికారి ధనలక్ష్మి**


**మదనపల్లె, ఆగస్టు 9 ప్రభాతవార్త :**



గ్రామాల పరిశుభ్రత బాధ్యత సర్పంచ్‌లదేనంటూ జిల్లా పంచాయితీ అధికారి (డిపిఓ) ధనలక్ష్మి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, సెక్రటరీలకు జరుగుతున్న శిక్షణా కార్యక్రమానికి రెండవరోజు శుక్రవారం ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా డిపిఓ మాట్లాడుతూ ఆర్‌జిఎస్ఎ స్కీమ్ కింద ఏపిఎస్ఐఆర్‌డిపిఆర్ వారి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈశిక్షణా కార్యక్రమంలో సర్పంచ్‌లు, సెక్రటరీలు శానిటేషన్, ఎస్‌డబ్ల్యుపిసి, జిపిడిటిలపై అవగాహన పొందాలన్నారు. గ్రామ పంచాయితీ అన్ని విధాల చూడచక్కని గ్రామ పంచాయితీగా రూపొందించాలన్నారు. పరిశుభ్రతలపై గ్రామ పంచాయితీకి మొదటి బహుమతిగా ప్రభుత్వం రూ.25వేలు అవార్డు ఇస్తుందన్నారు. అన్ని గ్రామ పంచాయితీల నందు పిఆర్‌వన్‌ఆప్ ద్వారా ప్రస్తుతం జరిగే శానిటేషన్ స్పెషల్‌డ్రైవ్ కార్యక్రమాలు పూర్తి స్థాయిలో నెరవేర్చి ఫోటోలు అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రతి శుక్రవారం సర్పంచ్‌లందరూ వైద్యసిబ్బందితో కలసి డ్రైడే నిర్వహించాలన్నారు. సర్పంచ్‌లు బాధ్యతగా వ్యవహరిస్తే గ్రామాలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతాయన్నారు. ఈకార్యక్రమంలో డిఎల్‌పిఓ నాగరాజు, ఎండిఓ భానుప్రసాద్, సెక్రటరీలు పాల్గొన్నారు.

## ఈఈని కలిసిన ఓసి అసోసియేషన్ కార్యవర్గం

**మదనపల్లె, ఆగస్టు 9 ప్రభాతవార్త :**



మదనపల్లె డివిజన్ విద్యుత్ ఈఈ గంగాధరంను శుక్రవారం విద్యుత్‌శాఖ ఓసి అసోసియేషన్ నూతన కార్యవర్గం కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా కార్యవర్గం అధ్యక్షులు జి.రామలింగారెడ్డి, సెక్రటరీ శేషాద్రి నాగరాజు, ట్రెజరర్ శివమూర్తులు డివిజన్‌లో ఉన్న కార్మికుల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ తన దృష్టికి వచ్చిన ఏ సమస్య అయినా త్వరితగతిన పరిష్కారానికి చర్యలు తీసుకొంటామన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ రెడ్డప్ప, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాసులు, కుమార్, సభ్యులు రఘు, వసంతరెడ్డి, శివమూర్తి, ఉపాధ్యక్షులు మహబూబ్‌బాషా, ఎం.రఘునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలు




**మదనపల్లె, ఆగస్టు 9 ప్రభాతవార్త :**
పట్టణంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవంను పురష్కరించుకొని రాష్ట్ర గిరిజన యానాది సేవాసంఘం ఆధ్వర్యంలో ఘనంగా ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఆర్టీసి బస్టాండు సమీపంలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ సర్కిల్ నుండి మల్లికార్జున సర్కిల్ ఎన్‌జిహోమ్ వరకు ర్యాలీ నిర్వహించి జై ఆదివాసి, జైజై ఆదివాసి అంటూ నినాదాలు చేశారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గడ్డం శ్రీనివాసులు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షులు పులిశ్రీనివాసులు మాట్లాడుతూ ఆదివాసి వర్గాల సాంప్రదాయాలు, సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షిండం గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు గంగిరెడ్డి, రాష్ట్ర కోశాధికారి రెడ్డిప్ప, నాయకులు విజయకుమార్, రాజేష్, నారాయణమ్మ, మధు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## కెజివిబి స్కూల్‌ను తనిఖీ చేసిన ఉమాదేవి

**రామసముద్రం, ఆగస్టు 9 ప్రభాతవార్త :**



మండలంలోని దిన్నెపల్లె కెజివిబి స్కూల్‌ను లీగల్ సర్వీసస్ అథారిటి అమరావతి ఆదేశాల మేరకు పుంగనూరు ఇన్‌చార్జ్ న్యాయమూర్తి ఉమాదేవి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమాదేవి స్కూల్ ప్రాంగణం, వంటగది, తరగతి గదులు, వాటర్‌ప్లాంటు మొదలగునవి తనిఖీ చేశారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ మస్తాన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## యువకుడు ఆత్మహత్యాయత్నం

**రామసముద్రం, ఆగస్టు 9 ప్రభాతవార్త :**
తల్లిదండ్రులు మందలించారని యువకుడు మనస్థాపం చెంది ఉరివేసుకొని ఆత్మహత్యాయత్యం చేసిన ఘటన మండలంలో ఆర్‌నడింపల్లి పంచాయితీ దిగువబొంపల్లి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకొంది. గ్రామస్థుల కథనం మేరకు మల్లప్ప కుమారుడు శివశంకర్(21)వాటర్ క్యాన్ తీసుకొచ్చే విషయమై కుటుంబీకులతో గొడవపడ్డాడు. దీంతో మనస్థాపానికి గురైన శివశంకర్ ఇంటిలో ఉరివేసుకొన్నాడు. దీంతో తల్లిదండ్రులు చికిత్సల కోసం మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు.

## అమ్మవారికి ప్రత్యేక పూజలు

**రామసముద్రం, ఆగస్టు 9 ప్రభాతవార్త :**



మండల కేంద్రంలోని బిసికాలనీలో వెలసిన గ్రామదేవత దుర్గాలమ్మకు తిరుమలరెడ్డిపల్లె మారెమ్మ అమ్మవార్లకు శుక్రవారం వేపాకు పొంగల్, నైవేద్యం సమర్పించి పలురకాల పుష్పాలతో అలంకరణ, అభిషేకాలు, అర్చనలు పలురకాల పుష్పాలతో అలంకరించారు. దీంతో భక్తులు మంగళహారతులు ఇచ్చి భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## వైభవంగా నాగులచవితి పూజలు

**రామసముద్రం, ఆగస్టు 9 ప్రభాతవార్త :**




మండలంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా పుట్టకు మహిళలు పూజలు నిర్వహించారు. శ్రావణమాసం శుద్ధ చవితి పర్వదినం రోజున మహిళలు వేకువజామున ఉపవాసదీక్షలతో నాగులపుట్టకు పాలు పోసి మొక్కులు తీర్చుకొన్నారు. అలాగే మండలంలో చెంబకూరు, రామసముద్రం, ఆరవ్యవైశ్య మహిళలు మండలంలోని భక్తులు నాగుల పుట్టకు ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది.

## కురబలకోట తహాశీల్దార్‌గా తపశ్వని

**కురబలకోట, ఆగస్టు 9 ప్రభాతవార్త :**
కురబలకోట తహాశీల్దార్‌గా జి.తపశ్వని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేశారు. నిమ్మనపల్లె మండల డిటీగా పనిచేస్తున్న తపశ్వనిని పదోన్నతిపై కురబలకోట తహాశీల్దార్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇక్కడ పనిచేస్తున్న డిటి నవీన్ కలికిరి తహాశీల్దార్‌గా పదోన్నతిపై బదిలీ అయ్యారు.

## విశేష అలంకరణలో కోర్టులో గంగమ్మ

**మదనపల్లె, ఆగస్టు 9 ప్రభాతవార్త :**



మదనపల్లె పట్టణం బెంగుళూరు రోడ్డులోని కోర్టులో గంగమ్మ శుక్రవారం సందర్భంగా విశేష అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు అమ్మవారిని సుప్రభాతసేవతో మేల్కోపి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి అభిషేక కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారను. అనంతరం అమ్మవారికి నైవేద్యరూపంలో సమర్పించిన తీర్థ, ప్రసాదాలను భక్తులకు పంచిపెట్టారు.

## అంటు రోగాలపై అవగాహన కార్యక్రమం

**కలికిరి, ఆగస్టు 9, ప్రభాతవార్త:**



మండలంలోని మర్రికుంట పల్లె పంచాయతీ గజ్జలవాండ్లపల్లెలో శుక్రవారం మేడికుర్తి వైద్యాధికారి డా.చిన్నరెడ్డప్ప ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రజలకు జాతీయ హిందూ మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. అంటువ్యాధులపై, డెంగీ, మలేరియాపై ప్రజలకు అవగాహన కల్పించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామంలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి గాయత్రి, ఎంఎల్‌హెచ్‌పీ సాహిదా, ఆశా కార్యకర్తలు ఖాదర్‌బీ, సుమలత, మంజుల, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## దళితులు నిరసన



**రైల్వేకోడూరు,ఆగస్టు 9,ప్రభాతవార్త:**
విజయవాడ నడిబొడ్డున ఉన్న అత్యంత వైభవ పేతంగా నిర్మించిన అంబేద్కర్ విగ్రహ సముదాయంలో అంబేద్కర్ పేరును తొలగించడం అత్యంత బాధాకరమైన విషయమని రైల్వేకోడూరులోని దళిత సంఘాలు స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మాజీ ముఖ్య మంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి దళితుల ఆత్మ గౌరవం కోసం భావితరాల స్ఫూర్తిని దృష్టిలో ఉంచుకొని అంబేద్కర్ విగ్రహాన్ని అత్యంత వైభవ పేతంగా నిర్మించారని దీనిని జీర్ణించుకోలేని తెలుగుదేశం పార్టీ అల్లరి మూకలు పథకం ప్రకారం అంబేద్కర్ పేరుని తొలగించడం దారుణమని వారు తీవ్రస్థాయిలో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా కొంత మంది విగ్రహం వద్ద శిలాఫలకాన్ని తొలగించిన వారిపై కఠిన చర్యలు తీసుకుని భవిష్యత్తులో ఎటువంటి దాడులు జరగకుండా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్వి రమణ, రఘు, బుల్లెట్ శివ, మందపాటి శంకరయ్య, విజయభాస్కర్, మారెళ్ళ రాజేశ్వరి, కొప్పుల శంకరయ్య, మహేష్, రమణ, దళితులు పాల్గొన్నారు.

## రాజంపేట పీలేరు బస్సు సర్వీసు ప్రారంభం




**సుండుపల్లె, ఆగస్టు 9, ప్రభాతవార్త:**
సుండుపల్లె బస్టాప్ నందు నూతన బస్సు సర్వీసును శుక్రవారం రాజంపేట నియోజకవర్గం టీడీపీ ఇన్‌ఛార్జి బాల సుబ్రమణ్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయన మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలలో రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నిర్వీర్యమైందని నారా చంద్రబాబునాయుడు సీఎం అయిన తరువాత సుమారు 1400 బస్సులు ఏపీఎస్ ఆర్టీసీ పరిధిలోకి వచ్చాయని సుమారు 400 బస్సులు రోడ్ల మీదికి వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై హుసేన్, ఎంపీపీ రాజమ్మ, డీఎల్ రాజా, జనసేన రామ శ్రీనివాస్, జనసేన రెడ్డి రాణి, మాజీ ఎంపీటీసీ మోహన్‌బాబు నాయుడు, టీడీపీ నాయకుడు మల్లెపాటి శివరాం నాయుడు, టీడీపీ నాయకుడు శ్రీరాములు, మాజీ మార్కెట్ ఛైర్మన్ రామ నాయక్, తిమ్మసముద్రం మండల టీడీపీ క్లస్టర్ ఇన్‌ఛార్జి శివకుమార్ నాయుడు, దామోదర్ నాయుడు, వెంకటేశ్వర నాయుడు, చలపతి నాయుడు, ప్రతాప్‌రెడ్డి, మేకల మహబూబ్ బాషా, తెదేపా, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు, ఆర్టీసీ ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శిక్షణ కార్యక్రమం

**రామాపురం, ఆగస్టు 9, ప్రభాతవార్త:**
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు మండలంలో గ్రామాల అభివృద్ధి కొరకు సర్పంచులకు పంచాయతీ కార్యదర్శులకు ఈనెల 12, 13, 14 తేదీల్లో మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో ప్రభాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమం 3 రోజుల పాటు గ్రామ పంచాయతీ వవిధులు, నిధులు, బాధ్యతలు గ్రామాభివృద్ధి ప్రణాళికపై నిర్వహణ ఉంటుందన్నారు. సర్పంచులు, గ్రామ కార్యదర్శులు తప్పక సమావేశానికి హాజరుకావాలని ఆయన అన్నారు.

## క్షేత్రస్థాయిలో పరిశీలించండి



**రామాపురం, ఆగస్టు 9, ప్రభాతవార్త:**
అన్నమయ్య జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు రామాపురం మండలంలోని ఫ్రీ హోల్డ్ భూములను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నామని ఇన్‌ఛార్జి తహసీల్దారు సిద్దేశ్వరరావు అన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ గతంలో డీ పట్టాలు పొంది గత ప్రభుత్వం 2023 డిసెంబరు నుంచి ఇప్పటి వరకు ఫ్రీ హోల్డ్ చేసిన భూములకు సంబంధించి క్షేత్రస్థాయిలో పునర్విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఆయా గ్రామాల వీఆర్వోలకు ఆయన సూచించినట్లు చెప్పారు.

## కలికిరి ఏఎస్సైగా మధుసూదనాచారి

**కలికిరి, ఆగస్టు 9, ప్రభాతవార్త:**
కలికిరి పోలీసు స్టేషన్ ఏఎస్సైగా మధుసూదనాచారి, హెడ్ కానిస్టేబుల్‌గా మనోహర్ శుక్రవారం తిరిగి భాద్యతలు స్వీకరించారు. గతంలో ఎన్నికల విధుల నిమిత్తం పెద్దమండెం పీఎస్‌కు ఏఎస్సై మధుసూదనాచారిని, హెడ్ కానిస్టేబుల్ మనోహర్‌ను రామసముద్రంకు అటాచ్ చేయడం జరిగింది. ఇటీవల కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఎస్పీ విద్యాసాగర్ నాయుడు అటాచ్డ్ తొలగించి గతంలో ఎక్కడెక్కడవిధులు నిర్వహిస్తున్న వారిని వారి స్థానాలకు పంపాలన్నారు. దీంతో శుక్రవారం ఏఎస్సై, హెడ్ కానిస్టుబుల్ బాధ్యతలు స్వీకరించారు.

## యూనివర్శిటి టాపర్లు మైదుకూరు విద్యార్థులు

**మైదుకూరు ఆగష్టు 9, ప్రభాతవార్త :**





యోగివేమన విశ్వవిద్యాలయం విడుదల చేసిన డిగ్రీ రెండవ, నాలుగవ సెమిస్టర్ పరీక్ష ఫలితాలలో మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి యూనివర్సిటిలో టాపర్సుగా రావడం పట్ల ప్రిన్సిపల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి హర్షం వ్యక్తం చేశారు.తమ కళాశాలలో చదువుచున్న విద్యార్థులు వరసగా గత మూడు,నాలుగు సెమిస్టర్ల నుండి యూనివర్సిటి టాపర్లుగా నిలిచి కళాశాల కీర్తిని పెంపొందించారని వారికి ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు.ఈ సంధర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను మరియు అందుకు కృషిచేసిన అధ్యాపకులను ప్రత్యేకంగా అభినందించారు. నాలుగవ సెమిస్టర్ ఫలితాలలో బిఎస్సి, బిజెడ్‌సి విభాగానికి చెందిన ఎస్.స్వరూప 9.71 పాయింట్లతో యూనివర్సిటి మొదటి స్థానాన్ని పొందారని అలాగే 9.51 పాయింట్లతో ఆర్.ఆయేషా మంచి ప్రతిభ కనబరిచారని, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ విభాగానికి చెందిన ఏ.వసంత 9.41 పాయింట్లు, బీకాంకు చెందిన ఏ.కవిత 8.22పాయింట్లు,బిఎ విభాగానికి చెందిన కే.రాజు 8.67పాయింట్లతో ఉత్తమ ప్రతిభ కనబరిచారని తెలియజేశారు.అలాగే రెండవ సెమిస్టర్ ఫలితాలలో బిఎస్సీ బాటనీ హానర్స్‌లో వి.సౌజన్య 9.0పాయింట్లు, కే.సుజిత మరియు బి.నాగశృతి 8.75 పాయింట్లు,బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ చెందిన డి.సౌబాగ్య 8.75 పాయింట్లు మరియు బీకాం విభాగానికి చెందిన ఏ.సూర్యతేజ 8.17 పాయింట్లతో ఉత్తమ ప్రతిభ కనబరిచారని తెలియజేశారు.

## సబ్ - రిజిష్టర్ కార్యాలయం ఆకస్మిక తనిఖీ

**మైదుకూరు ఆగష్టు 9, ప్రభాతవార్త :**



మైదుకూరు సబ్ రిజిష్టర్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సంధర్భంగా ఈయన మాట్లాడుతూ సబ్ రిజిష్టర్ కార్యాలయంలో ఎటువంటి అవతవకలకు పాల్పడిన ఉపేక్షించేది లేదని. ఇక్కడికి వచ్చిన ప్రజలకు, రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పనులు చేసి పంపించాలని ఆదేశించారు.కార్యాలయంలో లావాదేవీలు ఒక స్టాంపురైటర్ ద్వారా జరుగుతున్నాయని నాదృష్టికి వచ్చిందని అందుకే ఆకస్మిక తనిఖీ చేశానన్నారు. సబ్ రిజిష్టర్ కార్యాలయంలో సౌకర్యాలు తక్కువగా ఉన్నాయని తొందర్లో మంచి బిల్డింగ్ చూసి అక్కడకు మారుస్తామన్నారు. ఈయన వెంట టిడిపి పట్టణ అధ్యక్షులు దాసరిబాబు.మిల్లు శ్రీను తదితర టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**మైదుకూరు ఆగష్టు 9, ప్రభాతవార్త :**
మైదుకూరు మండల పరిధిలో నేడు రెండవ శనివారం 33కెవి,11కెవి విద్యుత్ లైన్ల మరమ్మత్తుల కారణంగా ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, అంతరాయ వేళలను ప్రజలు, రైతులు గమనించవలసినదిగా మైదుకూరు ఎలక్ట్రికల్ అసిస్టెంటు ఎగ్జిక్యూటీవ్ ఇంజనీరు రామభద్రయ్య తెలియజేశారు.

## ఆకస్మిక తనిఖీ

**ప్రొద్దుటూరు క్రైం, ఆగస్టు 9, ప్రభాతవార్త:**



జిల్లాలోని రాజుపాలెం, ప్రొద్దుటూరు రూరల్, త్రీటౌన్, టుటౌన్ పోలీసు స్టేషన్లను శుక్రవారం జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గంజాయి ఎనిర్మూలనకు నిర్దేశించిన వంద రోజుల కార్యాచరణ ప్రణాళికను తప్పనిసరిగా అమలు చేయాలని క్షేత్రస్థాయిలో నిఘా ఉంచి గంజాయి విక్రయాలు అరికట్టాలని ఆదేశించారు. మట్కా, క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్ తదితర అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా నిఘా ఉంచాలని ఆదేశించారు. సిబ్బందిని క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పోలీసు అధికారులకు సూచించారు. చోరీలు జరగకుండా గస్తీ ముమ్మరం చేయాలన్నారు. ఆయన వెంట స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వెంకటకుమార్, ప్రొద్దుటూరు రూరల్ సీఐ రమణారెడ్డి, టుటౌన్ సీఐ యుగంధర్, వన్‌టౌన్ సీఐ శ్రీకాంత్, రాజుపాలెం ఎస్సై తులసీ నాగప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

## డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం : డీవైఎఫ్ఐ

**జమ్మలమడుగు, ఆగస్టు 9, ప్రభాతవార్త:**




డ్రగ్స్ రహిత సమాజం కోసం అందరం పాటుపడదామని డీఎస్పీ హుసేన్ పీరా పిలుపునిచ్చారు. డీవైఎఫ్ఐ యువజన సంఘం ఆధ్వర్యంలో కడప జిల్లా కమిటీ ముద్రించిన మాదకద్రవ్యాల నిర్మూలనపై సే నో డ్రగ్స్ పేరుతో ముద్రించిన పోస్టర్లను జమ్మలమడుగు డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ హుసేన్ పీరా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ యువత మత్తు, మాదక ద్రవ్యాల వంటి వాటి జోలికి వెళ్లద్దని వాటికి దూరంగా ఉండాలని తద్వారా కలిగే దుష్పలితాలు వారి భవిష్యత్తు అంధకారం అవుతుందన్న విషయాలు వివరించారు. యువత డ్రగ్స్ రహిత ఉద్యమంలో కలిసి రావాలని పిలుపునిచ్చారు. ముందుగా ఇటువంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న డీవైఎఫ్ఐ సంఘానికి, నాయత్వానికి అభినందనలు తెలిపారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ మాట్లాడుతూ యువతను డ్రగ్స్, మత్తు పదార్థాల వంటి చెడు వ్యసనాల వైపు నుంచి మంచి సన్మార్గం వైపు నడవడం కోసం డీవైఎఫ్ఐ యువజన సంఘం అవగాహన కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా ఎనిర్వహిస్తున్నామన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా డ్రగ్స్ రహిత సమాజం కోసం పాటు పడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ మాజీ నాయకులు వీరనాల శివనారాయణ, డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి తులసీశ్వర్ యాదవ్, పట్టణ ఉపాధ్యక్షులు సుభహాన్, పట్టణ కమిటీ సభ్యులు ఇస్సాక్, పుష్పరాజు తదితరులు పాల్గొన్నారు.

## పెండ్లిమర్రి ఎస్సైగా మధుసూదన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరణ

**పెండ్లిమర్రి, ఆగస్టు 9, ప్రభాతవార్త:**



పెండ్లిమర్రి ఎస్సైగా శుక్రవారం మధుసూదన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎలాంటి అసాంఘిక సంఘటనలు జరగకుండా ఉండాలని ఏవైనా సమస్యలుంటే ప్రజలు తమ దృష్టికి తేవాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## మర్యాద పూర్వక కలయిక

**జమ్మలమడుగు, ఆగస్టు 9, ప్రభాతవార్త:**



జమ్మలమడుగు డీఎస్పీ కార్యాలయంలో శుక్రవారం నూతన డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన హుసేన్ పీరాను ఎస్సీ, ఎస్టీ దళిత వేదిక జిల్లా ప్రెసిడెంట్ కోఆర్డినేటర్ కన్నెలూరు లక్ష్మీ మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ దళితులపై జరుగుతున్న అక్రమ దాడులు, దళితుల భూములను అగ్రవర్ణాల వారు కబ్జా చేయడం జరుగుతోందన్నారు. అన్యాయానికి గురైన దళితుల కుటుంబాలకు న్యాయం చేయాలని డీఎస్పీని కోరారు.

## తంబళ్లపల్లెలో స్కూలు కమిటీ ఛైర్మన్ల విజయదరహాసం

**తంబళ్లపల్లె, ఆగస్టు 9, ప్రభాతవార్త:**
తంబళ్లపల్లె మండలంలో 8వ తే దీ జరిగిన పాఠశాల కమిటీ ఛైర్మన్ల ఎన్నికల్లో తెదేపా కూటమి అభ్యర్థు లు ఘన విజయం సాధించారు. ఈ విషయమై శుక్రవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో మండల పార్టీ అధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి ఆధ్వర్యంలో నూతన ఛైర్మన్లు సంబరాలు చేసుకు న్నారు. ఈ సందర్భంగా వారు మా ట్లాడుతూ తంబళ్లపల్లె ఇన్‌ఛార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి సారథ్యంలో ఈ గెలుపు నాంది పలికామని భవిష్యత్తులో ఏ ఎన్నిక జరిగినా సమిష్టి కృషి, ఐక్యతతో ఎన్డీఏ కూటమి వైకాపాను మట్టికరిపించి క్లీన్‌స్వీప్ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా నేత సిద్దమ్మ, పురుషోత్తం, సుధాకర్‌రెడ్డి, బాలాజీ, మూలపల్లి శేఖర్, తులసీధర్ నాయుడు, రామచంద్ర, గంగరాజు, నరసింహులు, భాస్కర్, జగదీష్, మ్యూజికల్ శివ, చలపతి నాయుడు, శంకర్‌రెడ్డి, రామలింగారెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటరమణ, రాధాశెట్టి, ఉత్తన్న, ఛైర్మన్లు పాల్గొన్నారు.



**పేరు మార్పు**
కోగటం అల్లా బక్షన్ (పాతపేరు) భర్త కోగటం షేక్ లాల్ బాష, 17/452-1, నడింపల్లి వీధి, ప్రొద్దుటూరు టౌన్ మరియు (మం), వైఎస్ఆర్ కడప జిల్లా,ఏపీ కి చెందిన నేను నేటి నుంచి నా పేరు కోగటం షేక్ సల్మాగా మార్చుకోబడినది. అందరూ గమనించగలరు.

# గర్భిణీలకు రక్త పరీక్షలు, తగు సూచనలు



**ముద్దనూరు, ఆగస్టు 09, ప్రభాతవార్త:**
ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభయాన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ముద్దనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు వైద్యాధి కారిణి డా.కరిష్మా ఆధ్వర్యంలో శుక్రవారం నాడు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 39మంది గర్భిణీ స్త్రీలకు ఎత్తు, బరువు, రక్తపరీక్షలు, అల్బుమిన్, షుగర్ పరీక్షలు, బిపి పరీక్షలు నిర్వహించారు. ల్యాబ్ టెక్నీషియన్ జాసన్ గర్భిణీ స్త్రీలకు అందరికి హెచ్‌బి పరీక్షలు, అల్బు మిన్ షుగర్ పరీక్షలు చేయడం జరిగింది. రక్తహీనత ఉన్న గర్భిణీలకు అంగన్వాడి కేంద్రాలలో ఇచ్చే పోషకాలు కల్గిన చిక్కీలు, ప్రోటీన్స్, విటమిన్స్ కలిగిన కోడిగుడ్లు, పాలు, ఖనిజ లవణాలు, క్యాల్షియమ్ కలిగిన రాగి పిండితో చేసిన రాగి జావ మొదలైన పోషకాలు కల్గిన ఆహారం తీసుకోవాలని డాక్టర్ గర్భిణీ స్త్రీలకు తెలిపారు. ఆకుకూరలు ప్రతి రోజు తీసుకునే ఆహారంలో ఉండాలని తెలిపారు. ప్రమాదకర గర్భిణీలు డాక్టర్స్ పర్యవేక్షణలో ఉండాలని వివరించారు. ప్రతి గర్భిణీ స్త్రీ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి కాన్పులు చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వం వారు అందించే ప్రోత్సహకాలు, జనని సురక్ష, ప్రధానమంత్రి మాతృత్వ వందనయోజన, జనని శిశు సురక్ష యోజన పథకాల ద్వారా ప్రతి గర్భిణీ స్త్రీ లబ్ది పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాసరెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ శోభాకుమారి, ల్యాబ్ టెక్నీషియన్ జాసన్, ఫార్మసిస్ట్ జగదీష్, హెల్త్ అసిస్టెంట్ ఓబులేసు, సచివాలయ హెచ్‌ఓ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ముద్దనూరు, ఆగస్టు 09, ప్రభాతవార్త:**
విద్యుత్ సబ్‌స్టేషన్ నందు మరమ్మత్తులు కారణంగా శనివారం నాడు ముద్దనూరు మండలంలోని ఉప్పలూరు, బొందలకుంట, మంగపట్నం, ముద్దనూరు గ్రామాల్లో ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ముద్దనూరు ఏఈ రాజావర్మ తెలిపారు. అంతరాయాన్ని గమనించి ప్రజలందరూ సహకరఇంచాల్సిందిగా వారు కోరారు.

## భార్య కాపురానికి రాలేదని ఉరి వేసుకొని భర్త ఆత్మహత్య

**యర్రగుంట్ల, ఆగస్టు 09, ప్రభాతవార్త:**



యర్రగుంట్లలోని శాంతి నగర్‌లో శుక్రవారం వీర ప్రతాప్(28) ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం వీరప్రతాప్ ఐదేళ్ల క్రితం మైదుకూరు మండలంలోని కృష్ణాపురానికి చెందిన రజినీతో వివాహమైంది. ఈ క్రమంలో భార్యభర్తల మధ్య మనస్పర్ధలు రావడంతో వారంరోజుల క్రితం రజిని పుట్టింటికి వెల్లింది. తిరిగి రాకపోవడంతో శుక్రవారం వీరప్రతాప్ ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు సీఐ నరేష్ బాబుకు తెలుపగా వెంటనే ఘటనా స్థలానికి వెల్లి పరిశీలించి కేసు నమోదు చేసి ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


## కుటుంబ కలహాలతో ఉరేసుకొని వివాహిత మృతి

**ముద్దనూరు, ఆగస్టు 09, ప్రభాతవార్త:**



ముద్దనూరు మండలం ఉమ్మారెడ్డి పల్లె గ్రామానికి చెందిన అంజలీ ఫ్యాన్ కడ్డికి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొని మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం సింహాద్రిపురం మండలం నక్కలపల్లి గ్రామానికి చెందిన అంజలీకి ముద్దనూరు మండలం ఉమ్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన తుమ్మలూరు నరసింహారెడ్డికి సుమారు నాలుగు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి 15నెలల ఒక కుమారుడు ఉన్నాడు. ఆడపడుచూ తరచూ గొడవ పడుతూ ఉండేవారిని గురువారం రాత్రి కూడ గొడవ జరగడంతో మనస్థాపానికి గురై శుక్రవారం తెల్లవారుజామున ఫ్యాన్ కడ్డికి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ మైనుద్దీన్ పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జమ్మలమడుగు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతురాలి తల్లి వంగల రమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు.

## తహసీల్దార్ కార్యాలయానికి ఆకస్మిక తనిఖీ



**పుల్లంపేట, ఆగస్టు 09, ప్రభాతవార్త:**
పుల్లంపేట తహసీల్దార్ కార్యాలయాన్ని రాజంపేట సబ్ కలెక్టర్ వై.నిదియా దేవి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సంధర్భంగా కార్యాలయంలోని సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కార్యాలయంకు వచ్చే ప్రజలతో స్నేహభావంతో మాట్లాడాలశిన్నారు. ప్రజల నుంచి వచ్చే అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. అధికారులకు పలు సూచనలను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి తహసీల్దార్ లక్ష్మి ప్రసన్న, ఆర్ఐ నవీన్, వీఆర్వోలు, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంకు వెల్లి సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ, హౌసింగ్ ఏఈ తదితరులు పాల్గొన్నారు.

## శిశు మరణాలను తగ్గించాలి-డాక్టర్ సానే శేఖర్

**పుల్లంపేట, ఆగస్టు 09, ప్రభాతవార్త:**



మండలంలోని గర్భవతులు, బాలింతలకు ప్రతి నెల 9, 10వ తేదీలలో ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని మండల ప్రాథమిక వైద్యాధికారి ఎస్.మనోజ్ చంద్ర తెలిపారు. ఈ కార్యక్రమానికి ఇన్చార్జి డీఎంహెచ్‌ఓ డాక్టర్ సానె శేఖర్ హాజరై గర్భవతులకు, బాలింతలకు తగు సూచనలు, సలహాలు అందించారు. ముఖ్యంగా మాతృ మరణాలు, శిశు మరణాలను తగ్గించేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. బాలింతలు, శిశువులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా రక్త పరీక్షలు, మూత్ర పరీక్షలు, షుగర్, బిపి మొదలను పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని మండలంలో ఉన్న వారందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ ప్రసన్న కుమార్, మహేష్, స్వర్ణలత, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వాసవిమాతకు ప్రత్యేక అలంకరణ

**వేంపల్లె, ఆగస్టు 9, ప్రభాతవార్త ః**



వేంపల్లెలోని కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో వాసవిమాతకు పసుపు, కుంకుమ చీరతో ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో ప్రత్యేక అలంకరణ చేశారు. శ్రావణమాసం ప్రథమ శుక్రవారం సందర్భంగా అర్చకులు ఇంద్రకంటి ప్రసాదశర్మ వాసవిమాతకు పంచామృతాభిషేకం, మహామంగళ హారతి, తదితర విశేష పూజలు నిర్వహించారు. మహిళా మండలి అధ్యక్షురాలు ప్రవీణ మాట్లాడుతూ మహిళలతో లలితా సహస్రనామము, కుంకుమపూజ, మణిదీపవర్ణన, జాజిపూలతో ఆలయంలో పూజలు నిర్వహించినట్లు తెలిపారు. అలాగే తీర్థ ప్రసాదాలను అందించారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ఖాజీపేట, ఆగస్టు 09, ప్రభాతవార్త:**
ఖాజీపేట విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శనివారం నాడు మరమ్మత్తులు చేపట్టనున్నారు. ఈ మరమ్మత్తుల కారణంగా ఖాజీపేట వినియోగదారులకు ఉదయం 8:00నుండి మధ్యాహ్నం 1:00వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడే అవకాశం ఉందని ఈ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఖాజీపేట ఇన్చార్జి ఏఈ గోవర్ధన్ రెడ్డి కోరారు. నాణ్యమైన, మెరుగైన విద్యుత్ సరఫరాకు జరుగుతున్న మరమ్మత్తుల కారణంగానే సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఖాజీపేట ఇన్చార్జి ఏఈ గోవర్ధన్ రెడ్డి తెలిపారు.

## ఆగస్టు 15న ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు

**వేంపల్లె, ఆగస్టు 9, ప్రభాతవార్త ః**
స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న విద్యార్తులకు ఫ్యాన్సీడ్రస్ పోటీలు నిర్వహించనున్నట్లు వేంపల్లె మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి దివిజ సంపతి అన్నారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ మండలంలోని ఆయా పాఠశాలలకు చెందిన విద్యార్థులు వివిధ స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలతో ప్రసంగించాలని తెలిపారు. 1 నుండి 10వ తరగతి వరకు విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అవకాశం కల్పించినట్లు ఆమె తెలిపారు. పోటీల్లో పాల్గొనేందుకు ఈనెల 12వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ కోసం 8977471317 నంబరును సంప్రదించాలని ఆమె కోరారు. స్థానిక ఎంపీడీవో సభా భవనంలో ఆగస్టు 15న ఉదయం 11.00గంటలకు ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు ప్రారంభం అవుతాయని ఆమె చెప్పారు.

## క్విట్ ఇండియా ఉద్యమం చారిత్రక ఘట్టం

**వేంపల్లె, ఆగస్టు 9, ప్రభాతవార్త ః**



భారత స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రలో క్విట్ ఇండియా ఉద్యమం ఒక చారిత్రక ఘట్టమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత డాక్టర్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. శుక్రవారం వేంపల్లెలో కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి 82వ క్విట్ ఇండియా ఉద్యమ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశాన్ని వదిలి వెళ్లాలని 1942 ఆగస్టు 8న మహాత్మాగాంధీ ఆంగ్లేయులకు అల్టిమేటం ఇచ్చారన్నారు. ఆయన పిలుపు మేరకు మరుసటిరోజు ఆగస్టు 9న క్విట్ ఇండియా అంటూ లక్షలాది మంది కాంగ్రెస్ శ్రేణులు, సామాన్య ప్రజలు నినాదాలతో రోడ్ల మీదకు వచ్చారన్నారు. 1947 ఆగస్టు 15న ఆంగ్లేయులు దేశానికి స్వాతంత్ర్యం ఇచ్చి దేశం వదిలి వెళ్లిపోయారని తెలిపారు.

## ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

**కొండాపురం, ఆగస్టు 9, ప్రభాతవార్త ః**
కొండాపురం పోలీసుస్టేషన్ పరిధిలోని చౌటుపల్లె పునరావాస కేంద్రం సమీపంలో పేకాట ఆడుతున్న స్థావరాలపై ఎస్సై విద్యాసాగర్, సీఐ మహమ్మద్ రఫిలకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పేకాట ఆడుతున్న ఆరు మందిని అరెస్టు చేసి వారి నుండి రూ.30680 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

## ఐటీఐ సీట్లకు దరఖాస్తులు చేసుకోండి

**వేంపల్లె, ఆగస్టు 9, ప్రభాతవార్త ః**
వేంపల్లెలోని కందుల ఓబుళరెడ్డి ఛారిటీస్ ఐటీఐలో 2024-25 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపల్ ప్రసాదరావు అన్నారు. శుక్రవారం వేంపల్లెలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. 10వ తరగతి పాస్ లేదా ఫెయిలైన విద్యార్థులు వివిధ కోర్సులలో చేరడానికి దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. మూడో విడతలో మిగులు సీట్ల కోసం వేంపెల్ల ఐటీఐలో ఫిట్టర్, సివిల్, డీజిల్ మెకానిక్, వెల్డర్, ప్లంబర్ కోర్సులు ఉన్నాయని, ఆగస్టు 24వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు కళ్శాశాలలో ప్రిన్సిపల్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

## సీఐ సురేష్‌రెడ్డిని సన్మానించిన టీడీపీ నేతలు

**వేంపల్లె, ఆగస్టు 9, ప్రభాతవార్త ః**
వేంపల్లె అప్‌గ్రేడ్ పోలీసుస్టేషన్‌కు నూతనంగా విచ్చేసిన సీఐ సురేష్‌రెడ్డిని టీడీపీ నేతలు కలిసి సన్మానించారు. శుక్రవారం సీఐ సురేష్‌రెడ్డిని మాజీ దేవస్థాన ఛైర్మన్ ఎద్దుల కొండ్రాయుడు, టీడీపీ మాజీ జిల్లా కార్యదర్శి పి.వి.రమణ, మాజీ వార్డుమెంబరు రామకృష్ణారెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని సీఐను టీడీపీ నేతలు కోరారు. పాఠశాల వద్ద కూడా గస్తీ పెంచి నిఘా పెట్టాలని కోరారు. రాజకీయ నాయకులు, ప్రజలు, ప్రజాప్రతినిధుల సహకారంతో శాంతి భద్రతలను కాపాడేందుకు కృషి చేస్తానని సీఐ టీడీపీ నేతలకు హామీ ఇచ్చారు. ఎలాంటి సమస్యలు ఉన్నా పోలీసుల దృష్టికి తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నతస్థానాలను అధిరోహించాలి



**వేంపల్లె, ఆగస్టు 9, ప్రభాతవార్త ః**
ఆర్జీయూకేటీ ట్రిపుల్‌ఐటీల్లో అడ్మిషన్లు పొందిన విద్యార్థులు ఉన్నత స్థానాలను అధిరోహించాలని డైరెకర్లు కుమారస్వామి గుప్తా, భాస్కర్‌పటేల్‌లు అన్నారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి రెండో విడత జనరల్ కౌన్సెలింగ్ ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైంది. నూజివీడు, శ్రీకాకుళం క్యాంపస్‌లకు కలిపి 238మందిని పిలవగా 134మంది ప్రవేశాలు పొందారు. ఆర్.కె.వ్యాలీ, ఒంగోలు క్యాంపస్‌లకు కలిపి 518మందిని పిలవగా 310మంది ప్రవేశాలు పొందారు. మిగిలిన సీట్లకు త్వరలో మూడో దశ కౌన్సెలింగ్ ప్రారంభిస్తామని అడ్మిషన్ల కన్వీనరు ఆచార్య అమరేంద్రకుమార్ తెలిపారు. ట్రిపుల్‌ఐటీల సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజలకు అనువైన చోట కార్యాలయాలు ఏర్పాటు చేయాలి

**వేంపల్లె, ఆగస్టు 9, ప్రభాతవార్త ః**



వేంపల్లెలో ప్రజలకు అనువైన చోట పోస్టాఫీసు, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని అధికారులకు తెదేపా నాయకులు వినతిపత్రాలు సమర్పించారు. ఈ రెండు కార్యాలయాలకు ప్రభుత్వ భవనాలు లేవు. దీంతో తరచూ వేరే భవనాలకు మారుతూ ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని తెలుగు యువత మాజీ కార్యదర్శి ఎద్దుల శేషారెడ్డి, తెదపేఅ రాష్ట్ర మైనార్టి కార్పొరేషన్ మాజీ డైరెక్టరు ఎస్ఎండి షబ్బీర్‌లు పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి)ల దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు నాయకులు సంతమార్కెట్‌లో నిరుపయోగంగా ఉన్న భవనాలను నాయకులు పరిశీలించారు. ఇక్కడ పోస్టాఫీసు, రిజిస్ట్రేషన్ కార్యాలయం ఏర్పాటు చేస్తే బాగుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గోటూరు నాగభూషణం, భాస్కర్‌లు పాల్గొన్నారు.

## నూతన తహసీల్దారును కలిసిన ఏఐటీయూసీ నాయకులు

**కొండాపురం, ఆగస్టు 9, ప్రభాతవార్త ః**
కొండాపురం మండల రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం నూతన తహసీల్దారు కె.మాధవకృష్ణారెడ్డిని ఏఐటీయూసీ నియోజకవర్గ సహాయ కార్యదర్శి, ఏఐటీయూసీ మండల ప్రధాన కార్యదర్శి వెంకట రమణ, మండల అధ్యక్షులు సుబ్బారావులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పూలమాలలు వేసి శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎం.ప్రభుదాసు, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

## దేశ సంస్కృతికి చేనేత రంగం ప్రాముఖ్యమైనది

**పులివెందుల రూరల్, ఆగస్టు 9, ప్రభాతవార్త ః**
దేశ సాంస్కృతికి చేనేత రంగం ప్రాముఖ్యమైనదని పులివెందుల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.శ్రీనివాసులు అన్నారు. కళాశాలలోశుక్రవారం ఎన్ఎస్ఎస్ యూనిట్1, 2 ఆధ్వర్యంలో చేనేత వస్త్రాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ దేశ సంస్కృతి, వారసత్వానికి చేనేత రంగం ఎంతో ప్రాముఖ్యమైందన్నారు. పులివెందుల ఆప్కో మేనేజరు రవిశంకర్ మాట్లాడుతూ చేనేత వస్త్రాల వాడకంపై అవగాహన కల్పించారు. చేనేత వస్త్రాలను అందరు ఆదరించాలని, తద్వారా చేనేత కుటుంబాలకు సహకారం అందించిన వారవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సుధీర, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రధాన మంత్రి సురక్షిత మంత్రిత్వ అభియాన్ కార్యక్రమం

**ఖాజీపేట, ఆగస్టు 09, ప్రభాతవార్త:**



ఖాజీపేట ప్రాథమిక ఆరోగ్య పరిధిలోని 11 సచివాలయాల్లో ఉన్న సిబ్బంది గర్భిణీలను 32మందిని స్క్రీనింగ్ చేశామని డాక్టర్ ముబీన్ అన్నారు. చఅనంతరం ఆమె మాట్లాడుతూ ప్రధానమంత్రి సురక్షిత్ మంత్రిత్వ అభియాన్(పీఎంఎస్ఎంఏ) ప్రతి నెల 9, 10వ తేదిన గర్భిణీ స్త్రీ 4వ నెల నుండి 9వ నెల వరకు తప్పనిసరిగా పరీక్షా చేయించుకోవాలని తెలిపారు. ప్రతి గర్భవతి మొదటి గర్భం బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేసుకోవాలని తెలియజేశారు. జననీ సురక్ష యోజన గురించి, జేఎస్ఎస్‌కే, పీఎంఎంవీవై 5000నగదు పారితోషికాన్ని జేఎస్‌కే 1000 జేఎస్ఎస్‌కే, ఉచితంగా చికిత్స ఉచితంగా మందులు ఉచితంగా వైద్య పరీక్షలు ఉచితంగా అందిస్తామన్నారు. అదేవిధంగా రక్త సరఫరా ఉచితంగా రవాణా సౌకర్యం ప్రధానమంత్రి మృతృవందన యోజన ప్రయోజనాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి బి.నాగభూషణం మాట్లాడుతూ హై రిస్క్ గర్భవతులు ప్రత్యేక జాగ్రత్త కొరకు తీసుకోవలసిన నియమాలు తెలిపారు. 108, 102, 104 ఉపయోగాలు మాతాశిశు సంరక్షణ, ప్రసావాంతర సంరక్షణ బాలింత సంరక్షణ అన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ బి.కృష్ణ ప్రియ, శోభన్‌బాబు, ల్యాబ్ టెక్నీషియన్ దుర్గప్రసాద్, స్టాఫ్ నర్స్ లక్ష్మికాంతమ్మ, సుప్రజ, ఫార్మసి ఆఫీసర్ కేశవయ్య, ఆశలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

## కూరగాయల మార్కెట్, పార్కింగ్ వేలంపాట

**ప్రొద్దుటూరు, ఆగస్టు 09, ప్రభాతవార్త:**



ప్రొద్దుటూరు పురపాలక సంఘంనకు చెందిన తాత్కాలిక కూరగాయల దిన మార్కెట్ మరియు వాహణాల పార్కింగ్ కొరకు 2024-25 ఆర్థిక సంవత్సరంనకు సంబంధించి శుక్రవారం మున్సిపల్ కార్యాలయ సమావేశ భవణంలో వేలంపాట నిర్వహించినట్లు మున్సిపల్ కమీషనర్ రఘునాథ రెడ్డి తెలిపారు. మున్సిపల్ కమీషనర్ అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ వేలంలో ఐదుగురు పాత్రధారులు పాల్గొన్నారనరి, సర్కారు వారి పాట 90లక్షలు ప్రతిపాదించగా భూమిరెడ్డి రామాంజనేయ రెడ్డి అనే పాటదారుడు 90లక్షల 20వేలకు హెచ్చుగా ఆటపాడి తాత్కాలిక దిన కూరగాయల మార్కెట్ మరియు వాహణాల పార్కింగ్ గుత్తా హక్కును సొంతం చేసుకున్నట్లు తెలిపారు. ఈ పాట ఖరారు అయిన తేది నుండి 31-03-2025వరకు రుసుములు వసూలు చేసుకొనుటకు అవకాశం ఉంటుంది. ఈ వేలంపాటలో సుచ్చుగా పాటిన పాటలు కౌన్సిలర్ ఆమోదం పొందిన అనంతరం అమలులోకి వస్తుందన్నారు.

## ఎస్సీ వర్గీకరణపై పార్లమెంట్ ద్వారా చట్టబద్ధత కల్పించాలి

**ప్రొద్దుటూరు, ఆగస్టు 09, ప్రభాతవార్త:**



ఎస్సీ వర్గీకరణపై సుప్రింకోర్టు ఇచ్చిన తీర్పుతో ఉమ్మడి తెలుగు రాష్టాల జీవోలు ఆర్డినెన్స్ ద్వారా కాకుండా పార్లమెంట్ ద్వారా చట్టబద్రత కల్పించాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు సువర్ణ రాజు మాదిగ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఎస్సీ వర్గీకరణపై సుప్రింకోర్టు ఇచ్చిన తీర్పుకు ఏపీ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఏపీ భవన్‌లో కృతజ్ఞత సభ నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ అమరులైనటువంటి వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సంధర్భంగా సుప్రింకోర్టు ఇచ్చిన తీర్పుకు ఉమ్మడి రాష్ట్రాల మాదిగలు హర్శం వ్యక్తం చేశారు. ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి సుధాకర్ మాదిగ మాటాలనడుతూ మాదిగ మాదిగ ఉపకులాలకు న్యాయం జరగాలంటే వర్గీకరణ కావాలని తాత్కాలిక వర్గీకరణ వల్ల అప్పటికి మాత్రమే మేలు జరుగుతుందని భవిష్యత్తులో వర్గీకరణకు ప్రమాదం వచ్చే అవకాశం ఉందని తెలిపారు. బిజెపి ప్రభుత్వం వర్గీకరణ అంశం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించి మాదిగలకు న్యాయం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువసేన ఉపాధ్యక్షులు సాకె నారాయణ స్వామి, కేశేపల్లి నాగేంద్ర, తిట్ల రాజేష్, మేరిబాబు, రాజేశ్వరి, మద్దిలేటమ్మ, దాసు మరియు ఏపీ తెలంగాణ రాష్ట్రాల మాదిగలు పాల్గొన్నారు.

## పంటలను తప్పనిసరిగా ఈ-పంటలో నమోదు చేయాలి

**వీరపునాయునిపల్లె, ఆగస్టు 9, ప్రభాతవార్త ః**



రైతులు సాగుచేసిన పంటలను తప్పనిసరిగా ఈ-పంటలో నమోదు చేయించుకోవాలని కమలాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి రైతులకు సూచించారు. మండల వ్యవసాయాధికారి శ్యామ్‌బాబుతో కలిసి శుక్రవారం మొయిళ్లచెరువులో జరుగుతున్న ఈ-పంట నమోదును ఆయన పరిశీలించారు. ఈ-పంట నమోదు ఆవశ్యకత గురించి గ్రామాలలో విస్తృతంగా ప్రచారం చేయాలిన ఆయన సిబ్బందికి సూచించారు. పంట నమోదులో ఏవైనా వ్యత్యాసాలు కనిపిస్తే సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారని తెలిపారు. మండల వ్యాప్తంగా సుమారు 2482 హెక్టార్లలో వ్యవసాయ, 3325హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగులో ఉన్నాయన్నారు. రైతులు సాగుచేసిన ప్రతి పంటను ఈ-పంటలో నమోదు చేయాలని రైతులకు ఆయన సూచించారు. పత్తిలో సస్య రక్షణ చర్యలు చేపట్టాలని ఏడీఏ తెలిపారు. పురుగుల నివారణకు పిచికారి చేయాల్సిన మందుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది లక్ష్మిసింధూర, రైతులు పాల్గొన్నారు.

## రెజ్లర్ వినేష్ పోగట్ అనర్హత వేటుపై ఆంతర్యం ఏమిటి

**బద్వేలు అర్బన్, ఆగస్టు 9 (ప్రభాతవార్త):**




రెజ్లర్ వినేష్ పోగట్ అనర్హత వేటుపై ఆంతర్యం బయటపెట్టాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడి యం చిన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భనవంలో డీవైఎఫ్ఐ పట్టణ నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్యారిస్‌లో జరుగుతున్న ఒలంపిక్స్ క్రీడల్లో రెజ్లింగ్ 50 కేజీల విభాగంలో ఫైనల్‌కు చేరుకున్న ఫోగాట్‌పై అనూహ్యంగా అనర్హత వేటు వేయడంలో ఆంతర్యాన్ని బహిర్గతం చేయాలన్నారు. ఏదైదైనా క్రీడలో పాల్గొనక ముందే అన్ని విధాలుగా విచారణ చేసిన తర్వాతే ప్రవేశం కల్పిస్తారన్నారు. అలా విచారణ చేసి క్రీడల్లో పాల్గొనడానికి అవకాశం కల్పించి ఫైనల్స్‌లో ఆడాల్సిన సందర్భంలో ఉండాల్సిన బరువు కంటే ఎక్కువ ఉన్నారనే సాకుతో అనర్హత వేటు వేయడం సరికాదన్నారు. గత సంవత్సరం రెజ్లర్ ఫెడరేషన్ అధ్యక్షులు బీజేపీ ఎంపీ బ్రిజేష్ భూషణ్ లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా చేసిన పోరాటాన్ని గుర్తు పెట్టుకుని రాజకీయ కక్ష సాధింపు సాధించారని ఆయన ప్రశ్నించారు. ప్రధాని మోడీకి నిజంగా దేశ క్రీడాకారులపై ప్రేమ ఉంటే అంతర్జాతీయ రెజ్లర్ల కమిటి ఒలంపిక్‌స కమిటి తీసుకున్న నిర్ణయంపై తీవ్రంగా ఖండించాలని డిమాండ్ చేశారు. వినేష్ పోగట్‌కు ప్రజలందరూ అండగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో బద్వేలు పట్టణ అధ్యక్షులు ఆంజనేయు సహాయ కార్యదర్శి ఇమ్మానుయేల్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రిని కలిసిన బీజేవైఎం జిల్లా అధ్యక్షులు

**బద్వేలు అర్బన్, ఆగస్టు 9 (ప్రభాతవార్త):**



కడపలోని ప్రజలందరికీ అవసరమైన రిమ్స్ సర్వజన ఆసుపత్రిపై రాష్ట్ర ఆరోగ్యశాఖమంత్రివర్యులు సత్యకుమార్‌ను బీజేవైఎం జిల్లా అధ్యక్షులు బొమ్మన విజయ్ కలిసి పలు సమస్యలను విన్నవించారు. ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యం, అపరిశుభ్రత, పేషంట్లు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన తెలిపారు. అలాగే 20 సంవత్సరాలుగా వారసత్వం లాగా ఔట్ సోర్సింగ్ కాంట్రాక్టర్ బాల నాగిరెడ్డి కొనసాగం జరుగుతుందని, అలాగే మాజీ సీఎం ఫోటోలు ఇంకా మార్చలేదని, ప్రజలు వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ రిమ్స్‌కు వెళితే సమస్యలు వారికి స్వాగతం పలువకున్నాయాన్నరు. ఇలా ఆయన తనబృందంతో పరిశీలించన సమస్యలన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శులు సురేంద్ర, అశోక్‌కుమార్ రెడ్డి, కోశాధికార శ్రీకాంత్, జిల్లా కార్యదర్శి ఓబుళయ్య, సోషల్ మీడియా కన్వీనర్ సాయి ఈశ్వర్, బీజేవైఎం నాయకులు వినోద్‌కుమార్ రెడ్డి, చంద్ర తదితరులు పాల్గొన్నారు.